

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 256 • పేజీలు : 8 • శనివారం 8 జూన్ 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada | Visakhapatnam | Srikakulam | Rajahmundry | Kurnool | Guntur | Ongole | Nellore Tirupati

## రాష్ట్రపతి ముర్ముతో మోదీ భేటీ



- ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాలని వినతి
- ఎన్‌డిఏ నేతగా ఎన్నికైనట్లుగా పత్రం అందజేత
- ఆదివారం నాటి ప్రమాణానికి రాష్ట్రపతి ఆమోదం
- ముచ్చటగా మూడోసారి ప్రమాణానికి మోదీ సిద్ధం
- మంత్రివర్గ కూర్పుపై పార్టీ సీనియర్లతో మోదీ కసరత్తు
- కార్యక్రమానికి హాజరు కానున్న విదేశీ ప్రతినిధులు

**న్యూఢిల్లీ,జూన్ 7 :** ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నికైన నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం ప్రధానిగా ప్రమాణం చేయనున్నారు. వరుసగా మూడోసారి ఆయన ప్రధాని బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఎన్‌డిఏ భేటీ తరవాత శుక్రవారం సాయంత్రం రాష్ట్రపతి మిగతా 7లో





## బిజెపి అంటేనే సుపరిపాలన

### ఎన్‌డిఎ భేటీలో ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటన

**న్యూఢిల్లీ,జూన్ 7 :** ఎన్డీయే పక్ష నేతగా నరేంద్ర మోడీ మూడోసారి ఎన్నికయ్యాడు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్డీయే పార్లమెంటరీ పక్ష సమావేశంలో ఎన్డీయే కూటమి ఈ మేరకు మోడీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఎన్డీయే పక్ష నేతగా మోడీ పేరును రాజనాథ్ సింగ్ ప్రతిపాదించగా అమిత్ షా, గడ్కరీ, కుమారస్వామి, చంద్రబాబు,నితీశ్ కుమార్ తదితర ఎన్డీఏ నేతలు బలపరిచారు. ఈ సమావేశానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా హాజరయ్యారు. ఈ ప్రతిపాదనకు నూతన ఎంపీలు అందరూ ఆమోదం తెలిపారు. దీంతో మూడోసారి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగుమమైంది. ఈ ప్రతిపాదనను ఎన్‌డిఏ నేతలు రాష్ట్రపతి ముర్మకు అందచేస్తారు. ఈ నెల 9న సాయంత్రం 6 గంటలకు మిగతా 7లో



- ఎన్‌డిఏ పక్షనేతగా మోదీ ఏకగ్రీవ ఎన్నిక
- రాజ్‌నాథ్ ప్రతిపాదనకు అమిత్ షా మద్దతు
- మద్దతు తెలిపిన ఎన్‌డిఏ నేతలు బాబు, నితీశ్ తదితరులు
- మోదీ విజనరీ నేత అంటూ చంద్రబాబు పొగడ్తలు
- దేశానికి సరైన సమయంలో దొరికిన సరైన నేత అంటూ కితాబు
- భారత్ స్ఫూర్తిని నిలిపిన కూటమి ఇది
- ఇది విజయవంతమైన భాగస్వామ్యం
- పేదల సంక్షేమమే మనందరి కర్తవ్యం
- మరోసారి ఐదేళ్ల పాలనకు ప్రజలకు అవకాశం
- మంత్రి పదవుల పేరుతో బురిడీ కొట్టిస్తారు..
- ఎన్‌డిఏ సమావేశంలో మోదీ హెచ్చరిక



కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, సుమన్ మీనా

## కవిత కస్టడీ పొడిగింపు



**న్యూఢిల్లీ,జూన్ 7 :** ఢిల్లీ మద్యం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు జ్యుడీషియల్ కస్టడీ కోరుతూ శుక్రవారం సీబీఐ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. దీంతో మరోసారి కవితకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగించింది. జూన్ 21 వరకు రౌస్ అవెన్యూ కోర్టు మిగతా 7లో

## నీట్ ఫలితాల్లో అవకతవకలు

- వెంటనే విచారణకు ఆదేశించాలి
- కాంగ్రెస్ కార్యదర్శి ప్రియాంక డిమాండ్

**న్యూఢిల్లీ,జూన్ 7 :** నీట్-2024 ఫలితాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ మిగతా 7లో



## పవన్‌పై మోదీ ప్రశంసలు

- మోదీ నాయకత్వానికి జనసేన మద్దతు
- పవన్ తుఫాన్ అంటూ మోదీ ప్రశంసలు



**న్యూఢిల్లీ,జూన్ 7 :** దేశానికి మోదీ ఒక స్ఫూర్తి అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. పార్లమెంటు సెంట్రల్ హాలులో జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ మిగతా 7లో

## గవర్నర్‌ను కలిసిన కొత్త సీఎస్





గవర్నర్ నజీర్‌తో కొత్త సీఎస్ నీరభ్‌కుమార్ కాసేపు భేటీ

**విజయవాడ, జూన్ 7 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్‌కు నూతన ప్రభుత్వ కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, గవర్నర్‌ను కలిశారు. శుక్రవారం సాయంత్రం రాజ్‌భవన్ వెళ్లిన సీఎస్ నీరభ్.. గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కాసేపు భేటీ అయ్యారు. ఇది మర్యాదపూర్వకంగా భేటీగా తెలుస్తోంది.

## రాహుల్‌కు ఊరట

- పరువు నష్టం కేసు..
- బెయిల్ మంజూరు చేసిన కర్నాటక కోర్టు



**బెంగళూరు,జూన్ 7 :** 'పరువునష్టం కలిగించే' ప్రకటనలు వేయించినందుకు బిజెపి కర్నాటక శాఖ దాఖలు చేసిన కేసు మిగతా 7లో



## కాంగ్రెస్ గూటికి విశాల్ పాటిల్

### - వందకు చేరిన కాంగ్రెస్ సీట్ల సంఖ్య - స్వాగతించిన మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ, జూన్ 7 :** భారత్‌లో రాజకీయ సమీకరణాలు రోజురోజుకి మారుతున్నాయి. తాజాగా మహా రాష్ట్రలో రెబల్ ఎంపి విశాల్ పాటిల్ తిరిగి తన సొంత పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ 99 సీట్లను గెలుచుకున్న సంగతి మిగతా 7లో

## వాతావరణశాఖ చల్లని శుభవార్త



- విద్యుత్తు స్తంభాలకు ప్రజలు దూరంగా ఉండాలి
- ఏపిని తీవ్రంగా హెచ్చరించిన వాతావరణశాఖ
- ఏపీ,తెలంగాణలో ఇప్పటికే రుతుపవనాలు..
- ఐదురోజులపాటు వర్షాలు కురిసే అవకాశం

**అమరావతి,జూన్ 7 (ఆంధ్రపత్రిక):** రోహిణీకార్తెలో ఎండ వేడికి మలమల మాడిపోయిన ప్రజలకు వాతావరణశాఖ చల్లటి శుభవార్తను వినిపించింది. ఏపీ, తెలంగాణలో ఇప్పటికే రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. దీంతో వాతావరణం చల్లగా మారడంతోపాటు కొద్దిరోజులుగా సాయంత్రం సమయంలో ఉరు ములు, మెరుపులతో మోస్తరు వర్షాలు మిగతా 7లో

## ఎపి నూతన సీఎస్‌గా నీరభ్..



- సిఎస్‌గా బాధ్యతలు చేపట్టిన నీరభ్ కుమార్
- పూనం మాలకొండయ్య తదితరులు బదిలీ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**అమరావతి,జూన్ 7 (ఆంధ్రపత్రిక):** ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి నీరభ్ కుమార్ ప్రసాద్ మిగతా 7లో

## 12 న సిఎంగా చంద్రబాబు ప్రమాణం..

- ఏర్పాట్లను పరిశీలించిన అచ్చెన్నాయుడు
- చంద్రబాబు ప్రమాణానికి చురుకుగా ఏర్పాట్లు
- మంగళగిరిలోనే ప్రమాణ స్వీకార కార్యక్రమం..?
- మోదీ సహా పలువురు ప్రముఖుల రాక
- మంత్రివర్గ కూర్పుపై త్వరలోనే బాబు చర్చలు
- స్పీకర్ పదవి కోసం పలువురు నేతల పోటీ





**అమరావతి,జూన్ 7 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి భారీ విజయంతో ఈనెల 12న టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. మొదట జూన్ 9న ప్రమాణ స్వీకారం ఉంటుందని మిగతా 7లో

## వాస్తవాలు మాట్లాడాలి



- టీచర్ల బదిలీలపై నిరాధార ఆరోపణలు
- లంచాలు తీసుకున్నారని దుష్ప్రచారం
- ప్రకటన విడుదల చేసిన మాజీ మంత్రి బొత్స

**విజయనగరం,జూన్ 7 (ఆంధ్రపత్రిక):** టీచర్ల బదిలీలపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. బదిలీల కోసం బొత్స లంచాలు మిగతా 7లో

ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# జ్ఞాపక ‘శక్తి’

జ్ఞాపకం ఒక శక్తి! దానిని నిలబెట్టుకోవడం,పెంచుకోవడం,పంచుకోవడం ఒక కళ!అది ఒక వరం. దీనికి పూర్తి వ్యతిరేకమైనది మతిమరుపు.అదొక పెద్ద శాపం!వయసు పెరిగేకొద్దీ జ్ఞాపకశక్తి తగ్గడం,మతిమరుపు పెరగడం సహజమైన జీవచర్యగా భావించినా,దానిని అలావదల కూడదు.వృద్ధాప్యం వల్ల శారీరకమైన రుగ్మతలు వచ్చినాజ్ఞాపకశక్తిని అద్భుతంగా కాపాడుకున్నవారు మన మధ్యనే ఎందరో ఉండేవారు,ఇప్పటికీ ఉన్నారు.వారే మనకు ఆదర్శం.సివిల్ సర్వీసెస్ లో అఖిల భారత స్థాయి పోటీల్లో గెలిచి అద్భుతమైన ర్యాంకులు తెచ్చుకొని ఐఎఎస్ అధికారులుగా పెద్ద పెద్ద బాధ్యతలు నిర్వహించి,అల్జీమర్స్ బారినపడి బాధపడుతున్నవారు కూడా మన మధ్యనే ఉన్నారు.వీరి జీవితాలు,వారితో పెనవేసుకొన్నవారి కుటుంబ సభ్యులు వేదనామయమైన జీవితాన్ని గడుపుతున్నారు.మరుపురాకుండా చూసుకోవడం,జ్ఞాపకశక్తిని పెంచుకోవడం మన చేతుల్లోనే ఎక్కువశాతం ఉందనివైద్య శాస్త్రవేత్తలు,మానసికవైద్య శాస్త్ర నిపుణులు కూడా చెబుతున్నారు.మన ఆరోగ్య పరిరక్షణలో ఏమాత్రంమరువకూడని అంశం ‘జ్ఞాపకశక్తి’.నిన్నటి వరకూ మన మధ్యనే ఉన్న ‘కళాతపస్వి’ కె విశ్వనాథ్,‘అపరగంధర్వుడు’ మంగళంపల్లి బాలమురళీకృష్ణ,పూర్వ ప్రధాని పీవీ నరసింహారావు అమోఘమైన జ్ఞాపకశక్తిని చివరివరకూ నిలుపుకున్నారు.వీరిలో మంగళంపల్లివారిది ఇంకా విశేషమైన ఆరోగ్యం.వీరికి అనారోగ్యాలు సోకిన దాఖలాలు కూడా పెద్దగా లేవు.వీరి గురించే ప్రత్యేకంగా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే? వారు మన తెలుగువారు. ఎనిమిదిపదుల వయస్సు మించి జీవించినవారు. నేటి కుర్తాళ పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతి (పూర్వాశ్రమ డాక్టర్ ప్రసాదరాయకులపతి)కిఇప్పుడు 87ఏళ్ళ వయస్సు.ఇప్పటికీ కొన్నివేల పద్యాలు, శ్లోకాలు,స్తోత్రాలురసనాగ్రంపై నాట్యం చేస్తూ ఉంటాయి.ఆయన పుస్తకాలు చదవడం మానేసి కూడా 60ఏళ్ళు దాటిపోయింది.వీరే కాదురామ్ జెత్మలానీ,శ్రీపాద పినాకపాణి వంటివారు కూడా అటువంటివారే. వీరు దాదాపు 100ఏళ్ళు అద్భుతమైన జ్ఞాపకశక్తితో జీవించారు.సుమారు65 ఏళ్ళ వయస్సు నుంచి మతిమరుపు పెరిగే అవకాశాలు ఉన్నాయని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.ఒక్కొక్క నివేదిక ఒక్కొక్క రకంగా చెబుతున్నప్పటికీ మతిమరుపువిషయంలో,జ్ఞాపకశక్తిని పెంచుకోవడం అంశంలో అయిదుపదుల వయస్సు నుంచే సాధన చేయడం ఉత్తమం. అధికరక్తపోటు,మధుమేహం,కొలెస్ట్రాల్ వంటివాటి వల్ల రక్తనాళాలు దెబ్బతినడం, మెదడుకురక్తం సరిగ్గా సరఫరా కాకపోవడం, ప్రాణవాయువు సక్రమంగా అందకపోవడం వల్ల మతిమరుపుబారినపడే ప్రమాదం ఉందని వైద్యులు చేస్తున్న హెచ్చరికలను గౌరవించి,వారు సూచించినట్లుగాపాటించాలి. శారీరకమైన రుగ్మతలకు మందులు వేసుకుంటూ,వ్యాయామం చేస్తూ,నడక సాగిస్తూ ఉండడం ముఖ్యం.అట్లే యోగ సాధన,ప్రాణాయామం ,ఓంకారం, ధ్యానం వంటివాటిని కూడా కలిపి సాగాలి.అదే సమయంలో అతిగా ఆందోళన పడడం,క్రుంగుబాటు వంటివి ఇంకా ప్రమాదం. పొగతాగడం, మద్యపానం వంటివాటికి దూరమవ్వడంఎంత ముఖ్యమో వంటరితనానికి దూరమవ్వడం కూడా అంతకంటే ఎక్కువ ముఖ్యం.మనిషిని ‘సోషల్ యానిమల్ ‘ అంటారు. జనంతో,జనం మధ్య ఉండడం,స్నేహితులు, ఆత్మీయు లు,బంధువులను తరచూ కలవడం, వారితో గడపడం గొప్ప ఆరోగ్యాన్ని కలుగజేస్తుందని నిపుణులు చెప్పేమాటలు ఎంతో విలువైన మాటలు.తమను తాముఎప్పుడూ బిజీగా ఉంచుకోవడం,మెదడును పదునుపెట్టే వాటిలో సమయం గడపడం చాలా చాలా ముఖ్యం.ఇది అన్ని వయసులవారికీ వస్తుంది.ముఖ్యంగా 60దాటిన వారికి మరీ ముఖ్యం. మెదడును బాగా సద్వినియోగం చేయడం ఎంత ముఖ్యమో,మెదడుకు తగిన విశ్రాంతి ఇవ్వడం కూడా అంతే ముఖ్యం.వైద్యుల సలహాల మేరకు ఆహారాన్ని తీసుకోవడం,నిద్రలోనూ సమయపాలన పాటించడం కీలకం.వేదకాలంనాటి భారతీయ విద్యా విధానం చాలా గొప్పది. జ్ఞాపకశక్తినిచాలా చురుకుగా ఉంచేలా ఉండేది.గురువులు చెప్పింది వినడం,మెదడులో ధరించడం,వల్లెవేయడం,తిరిగి అప్పచెప్పడం.. ఇలా అంతా మౌఖికంగా సాగేది.తెలుగువారి‘అవధాన విద్య’ కూడాఈ సూత్రాలపైనే నిర్మాణమైంది.పద్యాలను ధారణ చేయడం వల్ల జ్ఞాపకశక్తి బాగా పెరుగుతుంది.పలకడం ద్వారా జరిగే చర్య ద్వారా రక్తప్రసరణ,ఆక్సిజెన్ ప్రవాహం బాగా జరుగుతాయి.ఈ సాధన విద్యార్థుల నుంచి వృద్ధుల వరకూ ఉపయోగపడుతుంది.ఆటలు,పాటలు శారీరక,మానసిక ఆరోగ్యాన్ని తీర్చిదిద్దేవే.మన విద్యావిధానంలో నిన్నమొన్నటి వరకూ ఉన్నాయి. కొన్నాళ్ళుగా అవి సన్నగిల్లాయి. ఇప్పుడిప్పుడే నూత్న విద్యా విధానం వాటిపై దృష్టి సారిస్తోంది. మొత్తంగా చూస్తేమతిమరుపు రాకుండా చూసుకోవడం,జ్ఞాపకశక్తిని పెంచుకోవడం చాలా వరకూ మన చేతుల్లోనే ఉంది.

# ఏడేళ్ళ వయసులో సన్మానాలందుకున్న వేదాంతం రాఘవయ్య..



కాలికి గజ్జెలు కట్టి చిందులు వేయటం, సంగీత సాధనలో అపూర్వ రాగాలు ఆలపించడం, అవసరమైన హావభావాలు ప్రదర్శించటం అయిదేళ్ళ వయసులో అక్షరాభ్యాసంతో మొదలైంది. ప్రహ్లాద పాత్ర ధరించి, మూడు రాత్రులు ప్రదర్శించి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టరు చేత ‘ముఖమల్ చమ్కీ సూటు’, రాజముద్రిక గల ‘బంగారు పతకము’లనుఏడేళ్ళ వయసులోనే అందుకున్నారు. కూచిపూడి నాట్య కళకు ఆలవాలమైన ఏడు యక్షగాన ప్రదర్శనలిచ్చి ప్రముఖుల మన్ననలందుకున్నారు. రంగస్థలంపై స్త్రీ, పురుష పాత్రలు పోషించి పేరు ప్రఖ్యాతులు ఆర్జించటంతో పాటు కూచిపూడి నాట్యానికి పేరు ప్రఖ్యాతులు ఆర్జించటంతో సరిపెట్టుకోకుండా, సినిమారంగంలో కూడా విశేష ప్రాభవం కనబరచి విశిష్ట నాట్యాచార్యులుగా కీర్తింపబడ్డారు వేదాంతం రాఘవయ్య. వేదాంతం రాఘవయ్య 1919 జూన్ 8న జన్మించారు. కూచిపూడి నాట్యానికి ప్రపంచవ్యాపితంగా కీర్తినార్జించిపెట్టిన కృష్ణా జిల్లాలోని కూచిపూడి వీరి జన్మస్థలం. తల్లి అన్నపూర్ణమ్మ, తండ్రి రామయ్య. ఐదవ ఏట అక్షరాభ్యాసం జరపటం హిందూ సంప్రదాయం. అన్నపూర్ణమ్మ, రామయ్య దంపతులు తమ కుమారునికి ఐదవ ఏట అక్షరాభ్యాసం జరిపించటంతో పాటు కూచిపూడి నాట్యం నేర్పించే ప్రయత్నం చేశారు. నాట్యమనేది ఆ గ్రామం యొక్క ఆయువుపట్టు. ‘కుక్క అరిచినా సంగీతం ఉట్టి పడుతుంది, గాడిద కదిలినా నాట్యం ఉట్టి పడుతుంది’ అని ఒక సామెత. కూచిపూడిలోని ఏ ఇంటిలో చూచినా గజ్జెలందియలు ఘల్లు ఘల్లు మనేవి. సంగీత సాధనాలు వినిపిస్తుండేవి. అలాంటి వాతావరణం గల గ్రామంలో జన్మించిన రాఘవయ్య తల్లిదండ్రులకు కూడా కూచిపూడి నాట్యం పట్ల మక్కువ, మమకారం ఎక్కువ. అందుకే తమ పుత్రునకు అక్షరాభ్యాసంతో పాటు కూచిపూడి నాట్యం కూడా నేర్పించటానికి సిద్ధమయ్యారు. నృత్య, సంగీతాలలో ప్రసిద్ధులుగా గుర్తింపు పొందిన చింతా వెంకట్రామయ్య వద్ద రాఘవయ్యకు నృత్యం, సంగీతాలు నేర్పించే ఏర్పాటు చేశారు.కూచిపూడి కళల్లోని యక్షగానాలు 1. ప్రహ్లాద 2. రామ నాటకము 3. హరిశ్చంద్ర 4. మోహినీ రుక్మాంగద 5. ఉషా పరిణయం 6. శశిరేఖా పరిణయం 7. గయ నాటకము. వీటన్నింటినీ గురువుల వద్ద నేర్చుకున్నారు రాఘవయ్య. వీటిలో అతి క్లిష్టమైంది, కష్టమైంది ‘ప్రహ్లాద’ యక్షగానం. దీని ప్రదర్శన కాలం గంటలకో, రాత్రికో పరిమితం కాదు. ప్రహ్లాదను సంపూర్ణంగా నృత్య ప్రదర్శన పూర్తి చేయటానికి మూడు రాత్రులు అవసరమయ్యేవట. ఆ బాలుడు అలా వరుస రాత్రులు అలుపు సొలుపు లేకుండా, ఆయాసం రాకుండా ప్రదర్శన ఇచ్చి ప్రేక్షకులను మెప్పించేవారు, మైమరిపించేవారు. మచిలీపట్నంలో సీతారామ కళ్యాణ మహోత్సవముల సందర్భంగా చింతా వెంకట్రామయ్య సమాజం ప్రహ్లాద నృత్య నాటకం ప్రదర్శించింది. దానిలో ప్రహ్లాద పాత్ర ధరించిన బాలుడి హావ, భావ, రాగ, తాళయుక్త ప్రదర్శనకు అచ్చెరువొందిన అప్పటి కృష్ణా కలెక్టరు (వీరు భారతీయులు కారు, ఆంగ్లేయులు) ఆ బాలునికి ‘ముఖమల్ చమ్కీ సూటు’, రాజముద్ర గల ‘బంగారు పతకం’లను రాజ లాంచనములుగా అందజేయటం అపురూప చరిత్రాంశం. ప్రహ్లాద పాత్ర ధరించి మెప్పించిన రాఘవయ్య వయసు ఏడేళ్ళు మాత్రమే.పదిహేడవ ఏడు వచ్చేవరకూ రాఘవయ్య బాల పాత్రలనే ధరిస్తూ మెప్పిస్తూ వచ్చారు. ఆ కాలంలో 30 బంగారు పతకాలు అందుకున్నారట. ‘శ్రీకృష్ణ లీలా తరంగములు’, ‘క్షేత్రయ్య పదములు’, ‘ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు’, జావళీలు, పుష్ప బాణ విలాసములోని సంస్కృత శ్లోకములు శాస్త్రబద్ధముగా, లయబద్ధముగా ఆలపించటం, ప్రదర్శించటం రాఘవయ్యలోని ప్రత్యేకత. వీరు ధరించిన వాటిల్లో ‘ఉషా కన్య’ పాత్ర అపురూపమైనదిగా గుర్తింపు పొందింది. ప్రఖ్యాత హనుమదోపాసకులు శ్రీ శిష్టా చంద్రమౌళి శాస్త్రిగారి ‘హనుమద్జయంతోత్సవములు గుడివాడ తాలూకా పెదపాడు గ్రామంలో జరిగినప్పుడు 1939లో ‘ఉషా పరిణయం’ ప్రదర్శించగా, దానిలోని ఆయన పోషించిన ‘ఉషాకన్య’ పాత్ర అభినయానికి బంగారు హనుమద్విగ్రహమును బహుమతిగా శాస్త్రిగారి చేతుల మీదుగా పలువురు పండితుల సమక్షంలో అందుకున్నారు రాఘవయ్య. అప్పటికి వారి వయసు 16 ఏళ్ళు మాత్రమే. ఆంధ్ర నాటక కళా పరిషత్ ఆరవ వార్షిక మహాసభలు 1936లో మద్రాసులో జరిగినప్పుడు చింతా వెంకట్రామయ్యగారు ‘ఉషా పరిణయం’ ప్రదర్శించారు. దానిలో ఉషాకన్యగా నటించిన రాఘవయ్య నటన, నాట్యం, అభినయాలకు మెచ్చిన దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు బంగారు పతకం అందజేయగా, ఆ సభలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన బెంగాలు నర్తకీమణి శ్రీమతి రాగిణీ దేవి రాఘవయ్యకు దుశ్శాలువా కప్పి సత్కరించారు. ప్రారంభంలో ఉషాంగన, శశిరేఖ, మోహిని పాత్రలకే పరిమితమైన రాఘవయ్య కాలక్రమంలో సీత, చంద్రమతి, లీలావతి లాంటి పతివ్రతల పాత్రలు కూడా పోషించి దేశం నలుమూలలా ప్రదర్శనలిచ్చి కూచిపూడి నాట్యానికి దేశవ్యాపిత గుర్తింపు తెచ్చారు. స్త్రీ పాత్రల పోషణకే వారు పరిమితం కాకుండా కృష్ణుడు, రాముడు, హరిశ్చంద్రుడు లాంటి పురాణ పురుషుల పాత్రలు ధరించి మెప్పించటంలో కూడా ‘దిట్ట’ అనిపించుకున్నారు. విజయవాడలో వసంత నవరాత్రోత్సవముల సందర్భంగా రాఘవయ్యగారు ప్రదర్శించిన “శశిరేఖా పరిణయం’ యక్షగాన ప్రదర్శనను హరికథా పితామహులుగా చరిత్రలో నిలిచిన ఆదిభట్ల నారాయణదాసుగారు తిలకించి ‘శశిరేఖ’, ‘శ్రీకృష్ణ’ పాత్రల అభినయానికి మెచ్చి తాను ధరించిన బంగారు పతకం ఒకటి తీసి రాఘవయ్యకు ఇచ్చి “కూచిపూడి నాట్య శక పురుషుడు”గా దీవించారు. కూచిపూడి నాట్యంలో వేలాది సత్కారాలు, సన్మానాలు అందుకున్న రాఘవయ్య గూడవల్లి రామబ్రహ్మంగారి ప్రోత్సాహంతో సినిమారంగంలోకి కూడా ప్రవేశించారు. ‘మోహినీ రుక్మాంగద’, ‘రైతుబిడ్డ’ లాంటి చిత్రాలలో నృత్య ప్రదర్శనలివ్వటంతో వారికి చిత్రసీమ పరిచయమైంది. ఆ తర్వాత ‘మాయా లోకం’, గరుడ గర్వ భంగము’ లాంటి చిత్రాల్లో పెద్ద వేషాలు పోషించి చిత్రరంగంలో స్థిరపడ్డారు. చిత్తూరు వి. నాగయ్య నిర్మించిన ‘త్యాగయ్య’ సినిమాలో చిన్నారి బాలికల చేత “గోపికా కృష్ణ” ప్రదర్శన చేయించి, నృత్య దర్శకునిగా గుర్తింపు పొందారు. ఆ తర్వాత మచిలీపట్నంలో ప్రముఖులు, పండితులు కొలువు తీరిన సభలో చిత్తూరు నాగయ్య సమక్షంలో రాఘవయ్య కాలికి ‘గండపెండేరము’ తొడిగారు. ‘దేవదాసు’, ‘చిరంజీవులు’, ‘సువర్ణ సుందరి’, ‘స్వర్ణ మంజరి’, ‘సతీ సక్కుబాయి’, ‘ఆడబ్రతుకు’ లాంటి ప్రఖ్యాత సినిమాలకు రాఘవయ్య నృత్య దర్శకులుగా పనిచేశారు. 1964లో జరిగిన అఖిల భారత నాట్యోత్సవాలకు రాఘవయ్య అధ్యక్షులుగా నియమితులయ్యారు. వారిని “భరత కళాప్రపూర్ణ” బిరుదుతో సత్కరించారు. నాట్యమునందు గల చతుర్విధాభినయం, సంగీత, సాహిత్యాల్లో సర్వ సమర్థులనిపించుకున్న వేదాంతం రాఘవయ్య 1973లో స్వర్గస్తులయ్యారు.

దాసరి ఆళ్వారస్వామి

# రేపటి నుండి మృగశిర కార్తె ప్రారంభం



ఈ కార్తె రోజు ప్రతి ఇంట్లో చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. దీని వెనుక ఆరోగ్య రహస్యం దాగివుంది. రోళ్లు పగిలే ఎండలను మోసుకొచ్చిన రోహిణికార్తె ముగిసి.. చల్లబరిచే మృగశిర మొదలవుతుంది. మృగశిర కార్తె అంటే.. అశ్విని మొదలుకుని రేవతి వరకూ మనకున్న 27 నక్షత్రాల్లో సూర్యుడి ప్రవేశం ఆధారంగా కార్తె నిర్ణయం జరుగుతుంది. భారతీయ జ్యోతి ష్య సాంప్రదాయం ప్రకారం.. ఒక్కో కార్తెలో ఒక్కో విధంగా ప్రకృతిలో మార్పులు జరుగుతుంటాయి. ఈ క్రమంలో సూర్యుడు మృగశిర నక్షత్రంలోకి ప్రవేశించి నాటినుంచి నైరుతి రుతుపవనాలు వస్తాయి. వాతావరణం ఒక్కసారి చల్లబడటం , ప్రకృతిలో అనేక మార్పులు చోటు చేసుకునే నేపథ్యంలో అనేక రకాల చెడు సూక్ష్మక్రిములు వంటివి పునరుత్పత్తి అవుతాయి. మానవునిలో రోగ నిరోధకశక్తి తగ్గి జ్వరం , దగ్గు , శ్వాస సంబంధ వ్యాధులు వస్తాయి. మృగశిర కార్తెలో చేపలు తినడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. ఇది శాస్త్రీయంగా నిరూపించబడింది. చేపలు తినడం వల్ల ముఖ్యంగా గుండె జబ్బులు , ఆస్తమా , మధుమోహ వ్యాధి ఉన్నవారు , గర్భిణులు ఈ సమయంలో చేపలు తింటే ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఈ నేపథ్యంలో మనిషి శరీరంలో మార్పులు జరిగి వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. గుండెజబ్బులు , ఆస్తమా తదితర అనారోగ్యసమస్యలు ఉత్పన్నమవుతాయి. వీటన్నింటికి అడ్డుకట్ట వేయాలంటే చేపలు తినాల్సిందే.

**అసలు మృగశిర కార్తెకు ఉన్న సంబంధం ఏమిటి..?**

వ్యాధుల నియంత్రణకు చేపలు మృగశిర కార్తె రోజు చేపలు ఎందుకు తింటారో తెలుసా..? రోకండ్లను సైతం పగులగొట్టే ఎండలు తగ్గిపోతాయి. వర్షాలు మొదలవుతాయి. 15 రోజుల పాటు ఈ కార్తె ఉంటుంది. మృగశిర కార్తె చేపలు తినడాన్ని మన పూర్వీకుల నుంచి ఆనాదిగా వస్తోంది. ఎండకాలం తర్వాత వాతావరణం చల్లబడటంతో మన శరీరంలో ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఈ క్రమంలో వేడి ఉండేందుకు చేపలను తింటారు. దీని వల్ల గుండె జబ్బులు , ఆస్తమా రోగులకు ఉపశమనం కలుగుతుంది. ఇదేకాక ఈ సీజన్‌లో చాలా మందికి జీర్ణశక్తితోపాటు రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంటుంది. జ్వరం , దగ్గు బారిన పడతారు. ఇలాంటి వాటి నుండి గట్టెక్కాలంటే చేపలు తినాల్సిందే.పూర్వీకులు శాఖాపరమైన ఇంగువను బెల్లంలో కలుపుకొని ఉండలు.. ఉండలుగా చేసుకుని తినేవారు. మాంసాహారులైతే చేపలను ఇంగువలో , చింత చిగురులో పెట్టుకుని తినేవారు. ఈ రోజు ఏ ఇంటా చూసినా చేపల పులుసే. చేపల కూర వంటకాలే కనిపిస్తుంటాయి. పులుసో , ఫ్రై చేసుకుని ఖచ్చితంగా తింటుంటారు.పంచాగ ప్రకారం ఆరుద్ర నక్షత్రంలో సూర్యుడు ప్రవేశించే సమయంలోని తిథి , వార , నక్షత్ర , యోగ , కరణాలు , శకునాలు తదితర అంశాల ఆధారంగా చేసుకుని ఆ సంవత్సరం యొక్క వర్షాన్ని నిర్ణయించడం జరుగుతుంది. ఈ విధంగా వ్యవసాయదారులకు నిత్యజీవనోపయోగిగా,వ్యవసాయం పనులకు మార్గదర్శకంగా ఈ కార్తెలు ఉపయోగపడుతున్నాయి.

**పురాణగాథ ప్రకారం**

మృగశిరస్సు కలిగిన మృగవ్యాధుడు అను వృతాసురుడు వరప్రభావంచే పశువులను , పంటలను హరించి వేయడం ప్రకృతి భీభత్సాలాను సృష్టించడం , వర్షాలకు అడ్డుపడటం జరుగుతూ ఉండేడిది. ఇతను చనిపోకుండా అనేక వరాలు కలిగి ఉండటంచేత ఇంద్రుడు సముద్ర హాలల నుండి వచ్చే నురుగును ఆయుధంగా చేసి చంపేస్తాడు.ప్రకృతి మార్పు ప్రభావంఈ కథ ఆధారంగా ఖగోళంలో ఇంద్ర నక్షత్రమైన జ్యేష్టాకు మృగశిరకు 180 డిగ్రీల దూరంలో ఉండటం వలన తూర్పు ఆకాశంలో ఇంద్ర నక్షత్రం ఉదయించగానే వృతాసుర నక్షత్రం అస్తమిస్తుంటుంది. ఇక్కడ నురుగు అనేది ఋతుపవనాలకు , వర్షాలకు సూచన. ఇంద్ర నక్షత్రమైన జ్యేష్ట ఉదయించినపుడు సూర్యుడు మృగశిరలోకి ప్రవేశించడం వలన మృగశిరకార్తె ప్రవేశిస్తుంది. వర్షాలు పడకుండా అడ్డుపడ్డ మృగాసురుని చంపిన ఇంద్రున్ని వర్షప్రదాతగా , వర్షదేవుడుగా పిలుస్తారు. ఇది కథ.

**చేపలలో పోషకాలు:**చేపలలో ఎన్నో పోషకాలున్నాయంటున్నారు వైద్య నిపుణులు. చేపలలో అనేకమైన మాంసకృతులతో పాటు శరీరానికి మేలు చేసే గుణాలు ఎన్నో ఉన్నాయి. కాల్షియం , పాస్పరస్ , ఐరన్ , మెగ్నీషియం , కాపర్ , జింక్ వంటి ఖనిజ పోషకాలు ఎన్నో లభిస్తాయి. చేపలు కొవ్వులు చాలా సులభంగాజీర్ణమై శక్తిని అందిస్తాయి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎవరైనా తినవచ్చు.చేపల్లో ఉన్న కొవ్వు మన శరీరంలో రక్త పీడనంపై మంచి ప్రభావం చూపుతాయి. ఓమేగా 3 కొవ్వు ఆమ్లాలలో డీహెచ్ఏ , ఈపీఏ వంటివి కంటి చూపునకు ఎంతో మేలు చేస్తాయి. అలాగే జ్ఞాపకశక్తిని కూడా పెంచుతాయి.చేపల్లో బీ12 విటమిన్ , రైబోఫ్లవిన్ , నియాసిన్ , బయోటిక్ , థయామిన్ తదితర విటమిన్లు లభిస్తాయి.ముద్ర చేపల కాలేయంలో విటమిన్ ఏ , డీ , ఈ , వంటి విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి.చేపలు గుండెకు సంబంధిత వ్యాధులకు , ఆస్తమా , షుగర్ వ్యాధి గ్రస్తులకు మంచి ఆహారంగా పని చేస్తుంది. ముఖ్యంగా గర్భిణులు , పిల్లల తల్లులకు ఎంతో మేలు. పిల్లల్లో జ్ఞాపకశక్తి , నాడీ వ్యవస్థ అభివృద్ధి చేస్తాయి చేపలుమన రాష్ట్ర చేపల్లో కొర్రమీనులో లభించే ఆరాఖిడోనిక్ ఆమ్లం ఉంటుంది. ఇది గాయాలైనప్పుడు రక్తం తొందరగా గడ్డకట్టించే స్వభావం ఉంటుంది దేశీయ మార్పు చేపల్లో ఐరన్ , కాపర్ వంటి ఖనిజ పోషకాలు ఎన్నో లభిస్తాయి. మృగశిర కార్తె రోజు చేపలను ఏ రూపంలో తిన్నా మన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది.మృగశిర కార్తెలో చేపలు తినడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. ఇది శాస్త్రీయంగా నిరూపించబడింది.చేపలు తినడం వల్ల ముఖ్యంగా గుండె జబ్బులు , ఆస్తమా గర్భిణులు ఈ సమయంలో చేపలు తింటే ఎంతో ప్రయోజనం ఉంటుంది.

సేనాధిపత్యం రమేష్

# పూజా విధానంలో అంతరార్థము

**గంటలు** :దేవాలయాల్లో పూజ సమయంలో గంటలు వాయిస్తారు. దీనివల్ల రెండు విధాల ప్రయోజనం ఉంది. ఒకటి- బయటి ప్రపంచంలో శబ్దాలు లోపలికి ప్రవేశించకుండా చేయడం, రెండవది-మనస్సును దేవుని మీదికి ఏకాగ్రంగా మళ్లించడంలో తోడ్పడుతుంది.

**దీపహారతి:**దీపాన్ని వెలిగించి దేవుని విగ్రహం ముందు తిప్పడం. దీనిలోని అంతరార్థం ఏమిటంటే దైవాన్ని జ్యోతి స్వరూపంగా భావించడం. దైవమే కాంతి. ఆ సమయంలో భక్తుల భావన ఈ విధంగా ఉంటుంది. ” స్వామీ! నీవే ఈ విశ్వంలో స్వయం ప్రభవమైన జ్యోతివి. సూర్యుడు, చంద్రుడు అన్నీ వీటిలోని తేజస్సు. కాంతివి నీవే. నీ దివ్య కాంతిచే మాలోని చీకటిని తొలగించి, మా బుద్ధిని ప్రభావితం చేయి” అని.

**ధూపం** :భగవంతుని ముందు పరిమళాలు వెదజల్లే అగరువత్తులను వెలిగిస్తాము. వాటి సువాసనలు అన్ని దిక్కులా వ్యాపిస్తాయి. వీటి ధూపం క్రిమిసంహారిణిగా కూడా పనిచేస్తుంది. భగవంతుడు సర్వవ్యాపి. విశ్వమంతా నిండియున్నాడు అన్న భావన అందరిలో కలుగుతుంది. ఈ విషయం అక్కడ ఉన్న వారందరికీ మాటి మాటికీ జ్ఞప్తి చేసినట్లవుతుంది.

**కర్పూర హారతి** :వ్యక్తిగతమైన అహంకారము కర్పూరమువలె కరిగిపోవాలని ఈ హారతిలోని అంతరార్థం. ఈ విధంగా జీవాత్మ పరమాత్మతో ఐక్యం కావాలని భక్తులు కోరుకుంటారు.

**గంధపు సేవ** :ఈ సేవలో చాలా అర్థం ఉంది. భగవంతుని విగ్రహానికి పూయడానికి గంధాన్ని మెత్తగా నూరుతారు. అంత శ్రమకు లోనయినప్పటికీ గంధం ఓర్పుతో సహించి, మంచి పరిమళాన్ని వెదజల్లి ఆహ్లాదం కలిగిస్తుంది. ఆ విధంగానే ఎన్ని కష్టాలకు లోనయినప్పటికీ భక్తుడు చలించక కష్టాలను చిరునవ్వుతో స్వీకరించాలి. ఎటువంటి పరిస్థితుల్లోనూ శత్రువుకైనా అపకారం తలపెట్టకూడదు. ఇదే ఈ గంధసేవలోని అంతరార్థం.**పూజ** :దేవునికి పత్రం, పుష్పం, ఫలం, తోయం అనే వాటిని భక్తులు పూజలో సమర్పిస్తారు. కాని భగవంతునికి వీటితో పనిలేదు. నిజానికి ఏ విధమైన వస్తువులు భక్తులు సమర్పించాలని భగవంతుడు కోరడు. కాని ఆ అర్పణలో ఎంతో పరమార్థం ఉంది.



**పత్రం(శరీరము)** :ఇది త్రిగుణాలతో కూడుకున్నది. పూజలో దీనిని భగవంతునికి అర్పిస్తాడు.**పుష్పం (హృదయము):** ఇక్కడ పుష్పం అంటే చెట్ల మీద పూచే పూవు అని అర్థం కాదు. సుగంధ పరిమళాలను వెదజల్లే హృదయ కుసుమం అని అర్థం. ఇటువంటి హృదయ కుసుమాన్ని దైవపరంగా అర్పించాలి.

**ఫలం (మనస్సు)** :మనస్సు ఫలాలను అంటే మనం చేసే కర్మల ఫలితాలను మనం ఆశించక భగవంతునికి అర్పితంచేయాలి. దాన్నే త్యాగం అంటారు.

**తోయం(నీరు)** :భగవంతుని అర్పించవలసిన నీరు అంటే మనలోని హృదయపూర్వకమైన ప్రేమ, ఆనందం మొదలైన దివ్య భావాల వల్ల వెలువడే ఆనంద భాష్పాలు దైవానికే అర్పితం కావాలి.**కొబ్బరికాయలు** :హృదయం అనే కొబ్బరికాయ కోరికలు అనే పీచుతో కప్పబడి ఉంటుంది. దానిలో ఉండే నీరు సంస్కారము. కోరికలు అనే పీచును హృదయం అనే కొబ్బరికాయ నుంచి వేరుజేసి, తీయనైన కొబ్బరిని భగవంతునికి అర్పితం చేయాలి. అదే నిజమైన నివేదన. లోపల సంస్కారము అనేవి వున్నంతకాలం, హృదయం శరీరాన్ని కదలకుండా అంటిపెట్టుకొని ఉంటుంది. హృదయము అనే కొబ్బరికాయను పీచు అనే కోరిక వాసన వదలదు. మనంచేసే పనులను విత్తనాలతో పోలుస్తారు. మంచి విత్తనం వేస్తే మంచి మొక్క ఎట్లా మొలుస్తుందో మంచి పనులు చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయి.

**నమస్కారము** :చేతులు జోడించగానే పదివేళ్లు కలసివుంటాయి. ఈ పదివేళ్లు పది ఇంద్రియములకు గుర్తు. ఇందులో కర్మేంద్రియ,జ్ఞానేంద్రియములను హృదయములోని పరమాత్మకు కైంకర్యము చేయుచున్నాను అని చేతులు జోడించుటయే నమస్కారములోని అంతరార్థము. **ప్రదక్షిణము** :ముల్లోకములన్నియు భగవంతుని స్వరూపముతో నిండివున్నాయి. సేకరణ .



# ఈసారి అడ్వకేట్ జనరల్ ఎవరు?

## రేసులో దమ్మలపాటి, డి.వి.రావు

**అమరావతి, జూన్ 7 (ఆంధ్రపత్రిక) :** ఎన్ డి ఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రస్తుత అడ్వకేట్ జనరల్ శ్రీధరన్ శ్రీరామ్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దానితో అడ్వకేట్ జనరల్ పోస్టుకు ఎవరి స్థాయిలో వారు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రధానంగా మాజీ అడ్వకేట్ జనరల్ దమ్మలపాటి శ్రీనివాస్, సుప్రీమ్ కోర్ట్ న్యాయవాది డాక్టర్ డి వి రావు ల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. కులం, గత అనుభవం దమ్మలపాటి కి కలిసివచ్చే అంశాలు కాగా 250 కు పైగా ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, 2000 కు పైగా కేసులు వాదించిన అనుభవం, చంద్రబాబు తో వున్న అనుబంధం డి వి రావుకు కలసివచ్చే అంశాలు. ఇలావుండగా ఈమధ్య కాలంలో శ్రీకాకుళం జిల్లాలో వాదించిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలు జిల్లా నాయకులకు ఇబ్బంది కలిగించడం వలన జిల్లా నాయకత్వం డి వి రావు కు సహకరిస్తుందా అన్నది సందేహమే న్యాయస్థానాలు 24 గంటలూ పనిచేయాలని వుమ్మడి రాష్ట్రంలో డి వి రావు చేసిన పాదయాత్ర, గుట్కాల నియంత్రణ కు ఆయన కృషి, చెరువులు మరియు ప్రభుత్వ ఆస్తుల రక్షణకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు వంటి అంశాలను బాబు పరిగణలోకి తీసుకుంటారా అన్నది వేచి సూడాలి. గతంలో కూడా ప్రధాన సమాచార హక్కు కమీషనర్ పోటీలో కూడా డి విరావు పేరు వినిపించినప్పటికీ చివరి నిమిషంలో వేరే వారికి ఆ పదవి వరించింది.

# కొత్త చంద్ర బింబం చూడాలి!

**కొంగ్రొత్త సుపరిపాలన కావాలి!!**
**అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాలకోటయ్య విజ్ఞప్తి**



**అమరావతి, జూన్ 7 (ఆంధ్రపత్రిక) :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చరిత్ర ఎరుగని, దరిత్రి మరువని విజయం సాధించిందని, ఇంతటి ఘనాతి ఘన విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలు కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు మోములో కొత్త చంద్ర బింబం చూడాలని, కొంగ్రొత్త పాలన అందించాలని కోరుకుంటున్నట్లు అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాలకోటయ్య అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో పాత్రికేయులతో మాట్లాడారు. పురాణ, ఇతిహాసాల కథలతో పోల్చి కూటమి విజయాన్ని కీర్తించారు. పాండవులు ఐదుగురే. మేము నూటొక్క మంది కౌరవులం. ఏం చేయగలరు? అని విర్రవీగి, వారి రాజ్యాన్ని ఆక్రమించి, ద్రౌపదిని వివస్త్రను చేస్తే, అరణ్యవాసం, అజ్ఞాత వాసం పూర్తి చేసుకున్న పాండవులు కురుక్షేత్ర మహా సంగ్రామంలో 101 మంది కౌరవులను వధించినట్లు, ఎవరో ఇద్దరు అడవులకు వచ్చారంట. వారిలో ఒకడు రాముడు అంట. అతని భార్య బాగుంటుందంట అని ఎత్తుకెళ్తే, సీతమ్మ జాడ పసిగట్టిన తరువాత జరిగిన రామ రావణ సంగ్రామంలో లంకేశ్వరుని కోట బస్మీపటలం అయినట్లు, వైసీపీ పార్టీ కోట గోడలు తునాతునకలు అయ్యాయని పోల్చి చెప్పారు. రాష్ట్రంలో కూటమికి వచ్చిన విజయదరహాసం విజయాన్ని సునామి, తుఫాను అని అనటం కంటే, ఓటర్ల ఊచకోత అని అనటం సబబేమో అని చెప్పారు. ఈ విజయంలో అమరావతి ఉద్యమంతో పాటు దళిత మహోద్యమ ఉద్యమం పూలదండలో దారంలా దాగుందన్నారు.

కొత్త ప్రభుత్వాన్ని మూడు వరాలు కోరుకుంటున్నట్లు అవి 1. రాజధాని అమరావతి నిర్మాణం, అభివృద్ధి, రక్షణ 2. ఐదేళ్ళ వైసీపీ విధ్వంస పాలనపై ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, దాని ద్వారా సమగ్ర న్యాయవిచారణ 2. ఖచ్చితమైన, నిజాయితీతో కూడిన సామాజిక న్యాయ సుపరిపాలన కావాలన్నారు. భవిష్యత్తులో రాజధాని అమరావతి ప్రాంతంలో అసువులు బాసిన అమరావతి అమర వీరుల స్మృతి చిహ్నం నిర్మించబోతున్నట్లు, ఎన్నారై (చికాగో)కు చెందిన యలమంచిలి ప్రసాద్ గౌరవాధ్యక్షులుగా కమిటీ రూపొందించినట్లు వెల్లడించారు. కేంద్రంలో కూడా చంద్రబాబు కీలక శక్తిగా మారారని, కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో అభివృద్ధి లేని రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలని ప్రభుత్వాన్ని బాలకోటయ్య కోరారు. విలేకరుల సమావేశంలో రైతు మహిళా నాయకురాలు కొమ్మినేని వరలక్ష్మి , రెల్లి సంక్షేమ సంఘం నాయకులు శిరంశెట్టి నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

# నీరబ్‌కు వేదవ్యాస్ అభినందనలు



**మచిలీపట్నం, జూన్ 7 (ఆంధ్రపత్రిక) :** ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నీరబ్ కుమార్ కు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ అభినందనలు తెలిపారు. వేదవ్యాస్ శాసనసభ్యులు గా చేసిన సమయంలో నీరబ్ కుమార్ కృష్ణాజిల్లాకు జాయింట్ కలెక్టర్ గా పని చేశారు. వీరిద్దరి మధ్య మంచి సత్ సంబంధాలు ఉండేవి. పాలనపరమైన కొన్ని వ్యవహారాలలో ఇద్దరూ కలిసి పని చేసిన సందర్భాలు ఉన్నాయి. ఈరోజు వేదవ్యాస్ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితు లయ్యారన్న వార్త వినగానే నీరబ్ కు వెంటనే ఫోన్ చేసి అభినందనలు తెలిపారు.

# ఉయ్యూరు గ్రంథాలయంలో ఘనంగా ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు



**ఉయ్యూరు, జూన్ 7: (ఆంధ్రపత్రిక) :** ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో గత నెల 15 నుండి ప్రారంభమైన వేసవి విజ్ఞాన తరగతులు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా ప్రతిరోజు విద్యార్థిని విద్యార్థులకు పలు అంశాలలో శిక్షణ నిర్వహిం చారు. ఇందులో భాగంగా శుక్రవారం నాడు విద్యార్థిని, విద్యా ర్థులచే కథల పుస్తకాలు చదివించి, చెప్పించారు. కాగా శుక్రవారం జరిగిన ముగింపు సభకు ముఖ్య అతిథి గా విచ్చేసిన ఐ.టి.ఐ. కాలేజీ ప్రిన్సిపల్ ఎన్ సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదువుకుని మంచి స్థాయిలో ఎదగాలని సూచించారు. వార్డు హెల్త్ సెక్రటరీ ఎం రాధిక మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు అతిథులచే బహుమతులు మరియు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం నడిమింటి పైడియ్య మరియు ఆయన కుమార్తె ఎన్ శిరీష సహకారంతో విద్యార్థులకు అల్పాహారం, స్వీట్స్ మరియు ఫ్రూటీలు అందజేశారు. గ్రంథాలయ సిబ్బంది వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి బి రమణి, విద్యార్థినీ, విద్యార్థులు మరియు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి చేసిన అక్రమాలపై

# సమగ్ర విచారణ జరపాలి

### ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్-టి.ఎస్.ఎఫ్ డిమాండ్



**విజయవాడ జూన్ 7 (ఆంధ్రపత్రిక) :** ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా ఉన్న ప్రొఫెసర్ హేమచంద్ర రెడ్డి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం విజయవాడ హనుమాన్ పేటలోని "ట్రైబల్ ప్రజా సమైక్య"రాష్ట్ర కార్యాలయం నందు మీడియా సమావేశంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర కార్యదర్శి విష్ణు నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీందర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ప్రైవేటు యూనివర్సిటీలుగా మార్చి కొన్ని కోట్ల రూపాయలను అక్రమ మార్గంలో తీసుకోవడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్షల మంది ఎంసెట్ విద్యార్థులు పరీక్షలు రాస్తే పరీక్ష ఫలితాలను విడుదల చేయకుండా విద్యార్థులు పక్క రాష్ట్రంలో పోయి కళాశాలలో చేరే విధంగా పక్కా ప్రణాళిక తీసుకుని ప్రైవేటు కళాశాలల నుండి లక్షల రూపాయలు కమీషనుల రూపంలో పొందుతూ పర్యటనల పేరుతో ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ రామ్మోహన్ రావు స్టార్ హోటల్ లో బస చేస్తూ మండలి యొక్క నిధులను లక్షల రూపాయలు ఖర్చు చేయడం జరిగింది. అదేవిధంగా ఇంటర్ షిప్ పేరుతో డొల్ల కంపెనీలతో చేసుకొని కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడం జరిగింది. ఉన్నత విద్యా మండలిలో కార్యకర్తలను ఉద్యోగులుగా నియమించుకోవడం సిగ్గుచేటు రాష్ట్రంలో అనేకమంది ప్రొఫెసర్లను వేధింపులకు గురి చేయడం జరిగింది. గత ఐదేళ్లకాలంలో యూనివర్సిటీ ఉపకులపతులుగా వరకట్న వేధింపులు, గృహ హింస కేసులు, అదేవిధంగా అవినీతి ఆరోపణలు ఉన్న వారిని తనకు అనుకూలంగా ఉన్న వారిని నిబంధనలకు విరుద్ధంగా విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతులుగా నియమించడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఐదేళ్ల కాలంలో దాదాపుగా 150 కోట్ల మేర అవినీతి అక్రమాలకు పాల్పడిన ప్రొఫెసర్ హేమచంద్ర రెడ్డి పై మరియు ఇతర అధికారుల మీద చట్టపరమైన విచారణ చేపట్టి, వారి పైన క్రిమినల్ కేసులను నమోదు చేసి, ఉన్నత విద్యా మండలిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు రామ్ రాజ్, వెంకటేష్, దివాకర్, ఈశ్వరయ్య, రఘునథ్ నాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

### ఈవీఎం, వీవీప్యాట్లకు కట్టుదిట్టమైన

# భద్రత

### - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు



**విజయవాడ జూన్ 7 (ఆంధ్రపత్రిక) :** సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణలో ఉపయోగించిన ఈవీఎం, వీవీప్యాట్లను కట్టుదిట్టమైన భద్రతతో గోదాములో భద్రపరిచినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు వెల్లడించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూర్తయినందున గొల్లపూడిలోని గోదాములో ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరిచి సీల్ వేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ డిల్లీరావు.. అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఎన్నికల ఇతర సామగ్రిని భద్రపరిచే కలెక్టరేట్‌లోని గోదామును పరిశీలించి దానికి కూడా సీల్ వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఉపయోగించిన ఈవీఎం, వీవీప్యాట్లను పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా గొల్లపూడిలోని గోదాములో భద్రపరిచినట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియలో



ఉపయోగించిన స్టాట్యుటరీ కవర్స్, ఫారాలు, రిజిస్టర్లు వంటి ఇతర ఎన్నికల సామగ్రిని జిల్లా కలెక్టరేట్‌లోని ప్రత్యేక గోదాములో సురక్షితంగా భద్రపరిచినట్లు కలెక్టర్ డిల్లీరావు తెలిపారు .కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కాగిత కృష్ణప్రసాద్‌ను మర్యాదపూర్వంగా కలిసిన

# ఏసి( వెలుగు) కనకారావు మరియు సిబ్బంది



**బంటుమిల్లి 07 జూన్ (ఆంధ్ర పత్రిక) :** పెడన శాసనసభ్యుడు కాగి త కృష్ణప్రసాద్‌ను మర్యాద పూర్వకం గా కలిసిన క్లస్టర్ ఏరియా కో ఆర్డినే టర్ నేటర్ (వెలుగు) పి కనకరావు నాలుగు మండలాల ఏపిఎమ్‌లు, సీ సీలు, సిబ్బంది. భారీ మెజారిటీతో విజయం సాధించిన కాగితకృష్ణ ప్ర సాద్‌ను వీరు శాలువాతో సత్కరించి పూల బొకేతో అభినందించారు.

# వెల్‌స్పన్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవ వేడుకలు



**విజయవాడ, 07 జూన్ (ఆంధ్ర పత్రిక) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని సస్టెయినబిలిటీ, పర్యావరణ సారధ్యం పట్ల తమ నిబద్ధ తను వెల్‌స్పన్ ప్రదర్శిం చింది. అన్ని శాఖల ఉద్యోగులు ఏకతాటిపైకి రావడంతో పాటుగా మన గ్రహాన్ని కాపాడటానికి అంకిత భావంతో చేస్తోన్న తమ ప్రయత్నాలను వెల్లడించారు. ప్లాంట్ హెడ్స్, అపెక్స్ సభ్యుల ప్రసంగాలతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ ప్రాముఖ్యతపై తమ ఆలోచనలను వారు పంచుకోవడంతో పాటుగా మన భూగోళాన్ని రక్షించుకోవడానికి చేపట్టే సమ్మిళిత కార్యక్రమాల ప్రభావాన్ని వెల్లడించారు. మొత్తం వెల్‌స్పన్ కమ్యూనిటీని వారి మాటలు ప్రభావితం చేయడం మాత్రమే కాదు.. మన రోజువారీ కార్యక్రమాలను పర్యావరణ స్పృహతో నిర్వహించాల్సిన ఆవశ్యకతను గుర్తించేలా చేశాయి. ఈ వేడుకలలో ప్రధాన ఆకర్షణగా మొక్కలు నాటే కార్యక్రమం నిలిచింది. మొత్తం 66 మొక్కలను ఇక్కడ నాటారు.

### మత్స్యకార కోటాలో బొమ్మిడి నాయకర్‌కు

# మంత్రి పదవి దక్కే అవకాశాలు

**విజయవాడ జూన్ 7 (ఆంధ్రపత్రిక)** తాజాగా జరిగిన ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా నర్సాపురం నుంచి పోటీ చేసిన బొమ్మిడి నాయకర్ అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. దాదాపు రెండు దశాబ్దాల నుండి మత్స్యకారుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి, మత్స్యకార కులాలను ఒకే తాటిపైకి తీసుకువచ్చిన నాయకర్ కృషికి తగిన గుర్తింపు, ప్రతిఫలం దక్కాలని ఆయ వర్గాలు తపన పడుతున్నారు. పార్టీ యువనేతగా, పార్టీ కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులను ఎదిరించి వారికి అండగా నిలబడి మాస్ లీడర్ గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మరో పక్క నాయకర్ సేవ ట్రస్టు ద్వారా ఉచిత వైద్య సహాయం, సలహాలు, పేద విద్యార్థుల చదువుకు తగిన ప్రోత్సాహాలు, రక్తదానం, వాటర్ ట్యాంకర్ల ద్వారా గ్రామాలకు నీటి సరఫరా వంటి అనేక సేవా కార్యక్రమాలు చేసి అన్ని వర్గాల ప్రజలను సమాన దృష్టితో చూసిన మత్స్యకార నేతగా అనతికాలంలోనే నాయకర్ రాష్ట్ర స్థాయి గుర్తింపు తెచ్చుకున్నారు. నాయకర్ ప్రతిభ గుర్తించిన పవన్ కళ్యాణ్, 2019లో నరసాపురం అసెంబ్లీ టికెట్ కేటాయించారు. ఆ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి చెందినప్పటికీ, జనసేన పార్టీకి అత్యధిక ఓట్లు పోలైన అభ్యర్థిగా పార్టీలో మంచి ఇమేజ్ సంపాదించుకున్నాడు. ఆ సమయంలోనే



పవన్ కళ్యాణ్ 'మత్స్యకార వికాస్' విభాగానికి నాయకర్ ను ఛైర్మన్ గా చేసి, మత్స్యకార సమస్యలపై ఉద్యమించాలని ప్రోత్సహించారు. ఈ క్రమంలోనే ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో బాధితులకు భరోసాగా నిలిచారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలనీ, మత్స్యకారుల ఉపాధిని ధ్వంసం చేస్తున్న జీవో 217ను రద్దు చేయాలని కోరుతూ కాకినాడ నుండి నరసాపురం వరకు చేపట్టిన పాదయాత్ర నాయకర్ ను మత్స్యకార కులాల్లో తిరుగులేని నేతగా చేసింది. వేట సమయంలో చనిపోయిన మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించాలని నాయకర్ చేసిన పోరాటం, విశాఖపట్నం బోట్లు దహనం సంఘటనలో మత్స్యకారుల తరపున ఉద్యమాలు వంటి అనేక కార్యక్రమాల ద్వారా నాయకర్ మత్స్యకారులలో ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. సుమారు 40 లక్షల జనాభా కలిగిన మత్స్యకారులు ఇచ్చాపురం నుండి తడ వరకు.. రాయలసీమ జిల్లాల్లోఉన్న మత్స్య అనుబంధ వృత్తిదారుల పట్ల అవగాహన ఉన్న నాయకర్ మత్స్యకార సహకార సొసైటీలను బలోపేతం చేసి, మత్స్యకారుల జీవితాలలో వెలుగు నింపగలడని ఆయా వర్గాల వారు ఆశిస్తున్నాయి. రాష్ట్రంలో విస్తృత పరిచయాలు కలిగి, కూటమి క్యాడర్ తో, నాయకులతో సన్నిహిత సంబంధాలు కలిగి పార్టీ విధేయుడిగా, వివాదరహితుడుగా, అన్ని వర్గాల ప్రజల మన్ననలను పొందుతూ నిత్యం ప్రజా సమస్యలపై పనిచేసే బొమ్మిడి నాయకర్ కు మంత్రి పదవి ఇవ్వాలని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

### నూతన ఎమ్మెల్యే కొల్లు రవీంద్రని మర్యాదపూర్వకంగా కలిసిన

# టిడిపి కార్పొరేటర్లు



**మచిలీపట్నం జూన్ 7 (ఆంధ్రపత్రిక) :** మాజీ మంత్రి, నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన కొల్లు రవీంద్ర ను శుక్రవారం వారి స్వగృహంలో, టిడిపి కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, రాళ్ల కొట్టు రాము, దింటకుర్తి సుధాకర్, అన్నం ఆనంద్, దేవరపల్లి సునీత, మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి రవీంద్రను సత్కరించారు.

## ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించిన

# టీం కృష్ణాకు అభినందనలు..!

### జిల్లా కలెక్టర్ బాలాజీ





**మచిలీపట్నం జూన్ 7 (ఆంధ్రపత్రిక) :** జిల్లాలో ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడానికి ఎన్నికల అధికారులు, సిబ్బంది టీం స్పిరిట్ తో పనిచేశారని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రశంసించారు. 2024 సాధారణ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించిన సందర్భంగా ఎన్నికల అధికారులు, సిబ్బందికి శుక్రవారం జడ్పీ కన్వెన్షన్ హాల్లో అభినందన సభను జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహించింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలలో ఎలాంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా, రీపోలింగ్ లేకుండా ఎంతో సమర్థవంతంగా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించిన ఎన్నికల అధికారులు, సిబ్బందిని అభినందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వివిధ ఎన్నికల అంశాలకు సంబంధించి ఏర్పాటు చేసిన నోడల్ అధికారుల బృందం ఎంతో చక్కగా పని చేశారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా శాంతియుతంగా నిర్వహించుటకు సహకరించిన జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, వారి పోలీస్ బృందాన్ని కలెక్టర్ అభినందించి ఘనంగా సత్కరించారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడంలో మీడియా చక్కని పాత్ర పోషించిందని, ఈ సందర్భంగా మీడియా మిత్రులకు అభినందనలు అంటూ కలెక్టర్ ప్రశంసించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతలు పరిరక్షించేందుకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తమ సంపూర్ణ సహకారాన్ని అందించారన్నారు.

తొలుత జాయింట్ కలెక్టర్, గన్నవరం రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మ, మచిలీపట్నం, గుడివాడ, పెనమలూరు నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు ఆర్డీవోలు ఏం. వాణి, పి. పద్మావతి, డి. రాజు, అవనిగడ్డ ఆర్ఓ బాలసుబ్రమణ్యం, పామర్రు ఆర్వో శ్రీదేవి, 16 ఎన్నికల అంశాలపై నోడల్ అధికారులు ఎన్నికల నిర్వహణలో వారి అనుభవాలను సమావేశంలో వివరించారు. అనంతరం ఎన్నికల అధికారులు సిబ్బందిని కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ శాలువ, మేమెంటోలతో సత్కరించారు. ఎన్నికల అధికారులు సిబ్బందికి దిశా నిర్దేశం చేసి, ఎన్నికల ప్రక్రియ విజయవంతం గావించడంలో ప్రధాన పాత్ర పోషించిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ను ఘనంగా సత్కరించారు. డిఆర్వో కె. చంద్రశేఖరరావు ఎన్నికల నిర్వహణలో అధికారుల, సిబ్బంది పాత్ర, సమస్యలను అధిగమించిన తీరును వివరించారు. ఈ సమావేశంలో ఏ ఎస్ పి లు జి. వెంకటేశ్వరరావు, ఎస్ వి డి ప్రసాద్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఏ ఈ ఆర్ వో లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సామాజికవర్గానికి

# తగిన న్యాయం చేయాలి

### ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ రాష్ట్ర సమావేశంలో వక్తల ఆవేదన



**విజయవాడ పశ్చిమ, జూన్ 7, (ఆంధ్రపత్రిక) :** ముదిరాజ్ కులాన్ని అన్ని రాజకీయ పార్టీలు విస్మరించాయని, ఇకనైన ముదిరాజ్ సామాజికవర్గానికి అన్ని రంగాల్లో తగిన స్థానం కల్పించి న్యాయం చేయాలని ముదిరాజ్ సామాజికవర్గ నాయకులు కోరారు. రాష్ట్ర ముదిరాజ్ అధ్యక్షులు కొర్నా వెంకటనారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో ముదిరాజ్ రాష్ట్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలభారత్ కోలి ముదిరాజ్ ఆల్ ఇండియా యూత్ అధ్యక్షులు కేసరి మహేంద్ర ముదిరాజ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో ముదిరాజు కులస్తులు సుమారుగా 20 లక్షల మంది ఉన్నప్పటికీ మమ్మల్ని గుర్తించని ప్రభుత్వాలు తప్పుల జనగణన వల్ల 3 లక్షలుగా చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్లో 175 నియోజకవర్గాల్లో కూడా ముదిరాజులును గుర్తించిన దాఖలాలు లేవని, ఒక ఎమ్మెల్యే,లేదా ఒక ఎమ్మెల్సీ కూడా ఇవ్వని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. ముదిరాజులని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నామినేట్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే చట్టసభల్లో నామినేట్ పదవుల్లో గుర్తించవలసిందిగా రిక్వెస్ట్ చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఉన్న ముదిరాజుల అందరూ ఐక్యమత్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు శివాజీ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజులకు బీసీ డీ నుంచి . బీసీ ఏ గ్రూపులోకి మార్చాలని కోరారు. ముదిరాజులకు కులవృత్తి కలిగించాలని,ఉద్యోగ రంగాల్లో వెనకబడి ఉన్నటువంటి ముదిరాజులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ మహాసభ కృష్ణా జిల్లా అధ్యక్షులు తుమ్మా శ్రీనివాసరావు మాట్లాడుతు ఏ పార్టీ వచ్చినా ముదిరాజులు కులస్తులను గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేసారు. ఏ పార్టీలోనైనా పార్టీ జండాలకే పరిమితం చేస్తున్నారన్నారు. పదవుల విషయం వచ్చేటప్పటికి ముదిరాజులకు న్యాయం జరగట్లేదని, ఈ విధానం మార్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్రఅధ్యక్షులు కొర్రన నారాయణ ముదిరాజ్ ,ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ కార్యదర్శి సాంబశివరావు ముదిరాజ్,రాజు ముదిరాజ్,పరసా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో చిన్నారి ముదిరాజ్ ,మహేష్ ముదిరాజ్, తోకల రవి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కాగిత కృష్ణ ప్రసాద్ని కలిసి అభినందనలు తెలియజేసిన బండి రామకృష్ణ



**బంటుమిల్లి 07 జూన్ (ఆంధ్రపత్రిక) :** పెడన అసెంబ్లీ నియోజవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నికైన కాగిత కృష్ణ ప్రసాద్ని జనసేన పార్టీ మచిలీ పట్నం ఇంచార్జ్ బండి రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి అభినం దనలు తెలియజేశారు. ఇరువురు నాయకులు రాష్ట్ర రాజకీయాలపై ముచ్చటించారు అనంతరం ఇటీవల జరిగిన ఎన్నికలలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కార్యదర్శిగా బండి రామకృష్ణ సేవలను కృష్ణ ప్రసాద్ కొనియాడుతూ అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సమీర్ డివిజన్ ఇన్చార్జిలు గణేష్, రామ్ జ్యోతి మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

## కాగిత కృష్ణ ప్రసాద్కు అభినందనలు





**మచిలీపట్నం జూన్ 7 (ఆంధ్రపత్రిక) :** కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన తెలుగు దేశం శాసన సభ్యులుగా ఘన విజయం సాధించిన పెడన శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్,గుడివాడ శాసన సభ్యులు వెనిగండ్ల రాము , పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా లను కలిసి అభినందనలు తెలియజేసారు. సోషల్ మీడియా సమన్వయ కర్త పామర్తి లక్ష్మణ్, అసెంబ్లీ రైతు అధ్యక్షులు చిల్లా సీతారామయ్య,జిల్లా రైతు ఉపాధ్యక్షులు వేములు శివాజీ,పట్టణ రైతు అధ్యక్షులు అళ్ళ మాధవ, పట్టణ రైతు కార్యదర్శి బడే రమణ, గోపు నరేష్, గోపు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కొడాలి నాని ఇంటి వద్ద ఉద్రిక్తత



**గుడివాడ 07 జూన్ (ఆంధ్రపత్రిక) :** ఎన్నికల్లో ఓడిపోయిన కొడాలి నాని ఇంటి పైకి దూసుకుని వచ్చిన. లితెలుగుయువత నాయకులుకొడాలి నాని ఇంటి వైపు వెళ్ళ కుండా తెలుగు యువత నాయకులను అడ్డుకున్న పోలీసులు పోలీసులకు తెలుగు యువత మధ్య వాగ్వాదం కొడాలి నాని ఇంటిపై రాళ్లు, గుడ్లు విసిరిన తెలుగు యువత,నాయకులు కొడాలి నాని ఇంటి వద్ద టపాసులు కాల్చిన పార్టీ నాయకులు. కొడాలి నానికి వ్యతిరేకంగా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తున్న తెలుగుదేశం కార్యకర్తలు..

## కాగిత కృష్ణ ప్రసాద్ను మర్యాదపూర్వకంగా కలిసిన

# పోలీసు ఉన్నతాధికారులు



**బంటుమిల్లి 07 జూన్ (ఆంధ్రపత్రిక) ;** శుక్రవారం నాడు పెడన నియోజకవర్గ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొం దిన కాగిత కృష్ణ ప్రసాద్ ను నాగేశ్వర రావు పేటలోని తమ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన పోలీసు ఉన్నతాధికారులు. కాగిత కృష్ణ ప్రసాద్ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో డి.ఎస్.పి అబ్దుల్ సుభాన్., మరియు పెడన సీఐ కె నాగేంద్రప్రసాద్, బంటుమిల్లి ఎస్సై పి వాసు, కృత్తివెన్ను ఎస్ఐ కొల్లాటి నాగరాజు, పెడన ఎస్సై శ్రీనివాస్, గూడూరు ఎస్సై వీర్రాజు, ఎస్ బి ఏ స్ ఐ అడప వెంకటేశ్వరరావు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు.

## రాష్ట్రంలో నియంత పాలన

# అంతం అయ్యింది

### టీడీపీ నేత : కాపా శ్రీనివాసరావు

**నూజివీడు 07 జూన్ (ఆంధ్రపత్రిక) :** నూజివీడు నియోజకవర్గ సీనియర్ నాయకులు కాపా శ్రీనివాసరావు గారు పట్టణంలోని ఎన్ టి ఆర్ కాంప్లెక్స్ లో ప్రెస్ మీట్ లో మాట్లాడారు. గత ఐదు సంవత్సరముల నియంత పాలన అంతమై ప్రజా పాలన ప్రారంభమైనదన్నారు. కూటమి ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో తీసుకెళ్తామని తెలియజేసారు. అధినేత చంద్రబాబుకి మరియూ లోకేష్ కి నూజివీడు సీటు గెలిచి బహుమతిగా ఇస్తాం అని మాట ఇచ్చాం ఇచ్చినట్లుగానే సుమారు 12 వేల పైచిలుకు మెజారిటీ తో గెలిచి సత్తా చాటం అని తెలియజేసారు. అన్నీ వర్గాలకు న్యాయం జరుగుతుంది అని తెలియజేసారు. అందరి కష్ట ఫలితమే ఇంతటి అద్భుత విజయం అని, కూటమికి సుమరు 56% ప్రజలు మద్దతు ఇచ్చారు ఇది ఒక చరిత్ర అని అన్నారు. కూటమిని ఆదరించిన అన్ని వర్గాలకు దాన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ తెలుగు రైతు అధ్యక్షులు అక్కినేని చందు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి ఓరుగు రఘు మరియూ ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో

# ఘనంగా ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు



**మైలవరం, జూన్ 7: (ఆంధ్రపత్రిక) :** స్థానిక శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞా న తరగతులు శుక్రవా రంతో ఘనంగా ముగి శాయి. గత నెల 15 నుండి ప్రారంభమైన ఈ వేసవి విజ్ఞాన తరగతులు ప్రతిరోజు పలు అంశా లపై విద్యార్థిని విద్యార్థు లకు ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రతిరోజు నిర్వ హించిన పలు అంశాలలో విద్యార్థిని, విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైన విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంసాపత్రంతో పాటు బహుమతి ప్రధానోత్సవం గావించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైలవరం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోయ సుధ, జెడ్.నాగిరెడ్డి, టి.సురేష్ బాబు, టి. సాంబశివరావు, విద్యార్థిని, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## పలు కోర్సులలో శిక్షణ పొందిన వారికి

# సర్టిఫికెట్స్ అందజేత



**మైలవరం, జూన్ 7: (ఆంధ్ర పత్రిక):** మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్టిఫికేట్స్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా తానా మాజీ అధ్యక్షులు ఎన్ఆర్ఐ కోమటి జయరాం పాల్గొని శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందించారు. మోస్ట్ ట్రస్ట్ మరియు మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోయ సుధ అధ్యక్షతన 45 రోజులపాటు జరిగిన ఉచిత కంప్యూటర్, టైలరింగ్, బ్యూటిషియన్, స్పోకెన్ ఇంగ్లీషు, హాండ్ రైటింగ్, చెస్ లో శిక్షణ పొందిన మహిళలకు, విద్యార్థులకు ధృవీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా కోమటి జయరాం పాల్గొని మాట్లాడుతూ యువతకు ఉపయోగపడే ఇలాటి కార్యక్రమాలు మోస్ట్ ట్రస్ట్ వారు చక్కగా నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం తరుపునుంచి ఎలాంటి సహాయం కావాలన్న సహకరస్తామని, గ్రామీణ ప్రాంతంలో ఒక చిన్న కుటుంబం నుండి వచ్చి అనేక ఒడిదుడుకులను ఎదొర్కొంటూ తమ వంతుగా ఒక మహిళగా సమాజానికి సేవలందిస్తున్న కోయ సుధను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అప్పసాని దుర్గ, సందీప్ మోస్ట్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు కాటంనేని వెంకటేశ్వరరావు, అధ్యక్షులు చనుమోలు వరప్రసాద్, ఉపాధ్యక్షులు అడుసుమిల్లి విఠల్ బాబు, కోఆర్డినేటర్ వసుకుమార్, కోశాధికారి అమీర్ హంజ, కఠారి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి జూలకంటి ప్రసాద్, డి.విజయలక్ష్మి, ఉష, అధికసంఖ్యలో మహిళలుపాల్గొన్నారు.

## ఆత్మహత్య చేసుకున్న వాలంటీర్ కుటుంబానికి

# కొడాలి నాని ఆర్థిక సాయం



**గుడివాడ 07 జూన్ (ఆంధ్రపత్రిక) ;** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఎన్నికల ఫలితాలు చూసి ఎవరు ఆధైర్యపడవద్దని మాజీ మంత్రి కొడాలి నాని పిలుపునిచ్చారు. సార్వత్రికఎన్నికల్లో గుడివాడ మాజీ మంత్రికొడాలి ఓటమిని తట్టుకోలేక వాలంటీర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళ వారం జరిగింది. గుడివాడ రూరల్ మండలం సైదేపూడి గ్రామానికి చెందినపిట్ట అనిల్ మాజీ మంత్రి కొడాలి నాని ఓటమి చెందిన విషయం తెలిసిన వెంటనే ఫ్యాన్ కి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కొడాలి నాని మృతుని ఇంటికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారి 5లక్షలు అర్థిక సహాయం అందించారు.. భవిష్యత్తులో వారి కి అన్ని విధాలుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతో పాటు నేను అండగా ఉంటానని కొడాలి నాని భరోసా ఇచ్చారు.

## నాదెండ్ల మనోహర్కు

# తిరుపతి అనూష సురేష్ శుభాకాంక్షలు



**విజయవాడ పశ్చిమ, జూన్ 7, (ఆంధ్రపత్రిక) :** శాసనసభ ఎన్నికలలో విజయ డంకా మోగించిన జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ను కలిసిన విజయవాడ 42వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు తిరుపతి అనూష, జనసేన నాయకులు తిరుపతి సురేష్ శుభాకాంక్షలు తెలియజేసారు. పార్టీ అఖండవిజయం సాధించడం పట్ల రాష్ట్ర ప్రజలంతా సంతోషంతో వున్నారని మనోహర్కు వారు వివరించారు. ఈ సందర్భంగా తిరుపతి సురేష్ మాట్లాడుతు రెట్టించిన ఉత్సాహంతో ఇకపై కూడా జనసేన పార్టీని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు తమ వంతు కృషిచేస్తామని తెలిపారు.

## ఎ. కొండూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి తనయుడు గడ్డి అజయ్ రెడ్డి ఆధ్వర్యంలో

# జాతీయ రహదారికి మరమ్మత్తులు



**ఎ. కొండూరు జూన్ 7 (ఆంధ్రపత్రిక) ;** ఇబ్రహీంపట్నం.. జగదల్పూర్ జాతీయ రహదారిపై మండలం లోని రామచంద్రపురం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు భారీ వాహనాల తాకిడికి పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికులకు వాహన చోదకులకు ప్రాణ సంఘటంగా మారింది. ఈ రోడ్డుపై రాత్రిపూట ద్విచక్ర వాహన చోటకులు గుంటల్లో పడి ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకి ఇరువైపుల గృహాలు తొలగించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టవలసి ఉండగా ఎన్ హెచ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సుమారు ఒక కిలోమీటర్ పొడవునా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాద భరితంగా మారింది. గత ప్రభుత్వం ఈ రోడ్డు విషయమై పట్టించుకోకపోవడంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాగానే ప్రయాణికుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని ఎ. కొండూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి తనయుడు (ప్రవాస భారతీయుడు) గడ్డి అజయ్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డు మరమ్మత్తులకు శ్రీకారం చుట్టారు ట్రాక్టర్లతో మెటీరియల్ తోలిగుంతలను పూడిపించారు . దీంతో ప్రయాణికుల వాహనచోదకుల ప్రయాణం సుఖాంతంగా మారడంతో హర్షం ప్రకటించారు. గడ్డి అజయ్ రెడ్డి కి రామచంద్రాపురం గ్రామస్తులు వాహన చోదకులు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామంలో వివిధ హోదాల్లో ఉన్న కార్యకర్తలు జన సైనికులు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి: నారా లోకేష్



**గుంటూరు : జూన్ 7( ఆంధ్రపత్రిక ):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గా గెలిచిన అనంతరం గళ్ళా మాధవి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భముగా నారా లోకేష్ గళ్ళా మాధవితో మాట్లాడుతూ భారీ మెజారిటీ ఇచ్చిన ప్రజలు, మనకు భారీ బాధ్యతను అప్పగించారని వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని, కార్యకర్తలకు అండగా నిలవాలని లోకేష్ సూచించారు. ఈ సందర్భముగా గళ్ళ మాధవి హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ వద్ద ఆశీస్సులు తీసుకున్నారు. టిక్కెట్ పొందిన తక్కువ సమయంలోనే మంత్రి విడదల రజిని చిత్తుగా ఓడించిన శివంగి గళ్ళ మాధవి అని బాలకృష్ణ అభినందించారు. అనంతరం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో భారీ మెజారిటితో గెలిచిన గళ్ళా మాధవిని చంద్రబాబు నాయుడు అభినందించారు. సీటు ప్రకటించిన ఆనతికాలంలోనే ప్రజల్లోకి వెళ్లి, ఇంతటి భారీ ప్రజామద్దతును కూడగట్టుకున్న మాధవి పనితీరును చంద్రబాబు అభినందించారు. ప్రభుత్వం నుండి తన సహాయ సహకారాలు ఉంటాయని, అభివృద్ధి సంక్షేమం ప్రజలకు చేరువచేసే విధముగా ముందుకు సాగాలని, గళ్ళా మాధవి గెలుపులో కీలక పాత్ర పోషించిన టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు, కార్యకర్తలకు చంద్రబాబు అభినందనలు తెలిపారు.

## బాపట్ల బిజెపి కార్యాలయం వద్ద సంబరాలు



**బాపట్ల జూన్ 7 (ఆంధ్రపత్రిక) :** భారత ప్రధాని నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రి అయిన సందర్భంగా బాపట్ల జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు జరిగాయి. శుక్రవారం కార్యాలయం ఆవరణలో నాయకులు బాణాసంచా కాల్చి ప్రధానమంత్రి కి అభినందనలు తెలిపారు. అనంతరం మిఠాయిలు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీనారాయణ జిల్లా ఓబీసీ అధ్యక్షులు కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు జిల్లా ఉపాధ్యక్షులు పామంచి రాంబాబు బాపట్ల పట్టణ అధ్యక్షులు మామిడి రమేష్ కుమార్ మువ్వల శ్రీనివాస్ , పిట్టలవానిపాలెం మండల అధ్యక్షులు టి శ్రీనివాసరాజు, బాపట్ల రూరల్ మండల అధ్యక్షులు సూర్యనారాయణ, కొ్ట్రా రామకృష్ణ , షేక్ కరీముల్లా , లీగల్ సెల్ కన్వీనర్ నటరాజుగారు నరాల శెట్టి శ్రీనివాస్ , కామరాజు గడ్డ శ్రీనివాసరావు , బాల నారాయణ గుండ్రెడ్డి శ్రీహరి పాల్గొన్నారు.

## దురహంకారంతో వ్యవహరించిన అధికారులకి శంకర గిరిమాన్యాలు తథ్యం

### గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ



**గుంటూరు : జూన్ 7( ఆంధ్రపత్రిక ):** అధికార దురహంకారంతో నియంత జగన్ రెడ్డి కి తాబేదార్లుగా వ్యవహరించిన అధికారులకి శంకరగిరిమాన్యాలు తథ్యం అని గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ అన్నారు. గుంటూరు లోని సిఐడి ప్రాంతీయ కార్యాలయంలో గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఆధ్వర్యంలో సిఐడి బాధితులతో కలిసి కేక్ కోసి భారీగా బాణసంచా కాల్చి సంబరాలు. అనంతరం కార్యాలయం వెలుపల ఉన్న అధికారులకు మిఠాయిలు పంచిన తెలుగుయువత నేతలు..తెలుగు యువత నేతలు వస్తున్నారని సమాచారాన్ని తెలుసుకొని ముందుగానే బయటకు వెళ్ళిపోయిన కొందరు అధికారులు.గడచిన ఐదేళ్లలో ప్రతిపక్షాలు ప్రజాసంఘాలు మీడియా సంస్థల యాజమాన్యాలను సైతం సిఐడి పేరుతో అక్రమ కేసులతో మానసిక వేధింపులకు గురిచేసి ఇష్టారాజ్యంగా కొందరు అధికారులు స్వామి భక్తి ప్రదర్శించారు. కార్యకర్తలను మానసిక వేదనకు గురిచేసారు. ఫోన్లు ల్యాప్టాప్ లు, బండ్లు సీజ్ చేసి పైశాచిక ఆనందం పొం దారు. గౌరవ కోర్టులను సైతం లెక్కచేయలేని పరిస్థితి.. కార్యక్రమంలో సిఐడి కేసు బాధితులు చేరెడ్డి జనార్దన్,షేక్ ఫిరోజ్,మంచోడు మణి,కరణం ప్రభాకర్,అభిరామ్ లతో పాటు టిడిపి వాణిజ్యవిభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు వలివేటి కృష్ణ,పశ్చిమ అధక్షులు తల్లం శేఖర్, తెలుగుయువత నాయకులు చెరుకుపల్లి నాగరాజు, గుత్తికొండ కిరణ్ యాదవ్,మన్నెం శ్రీనివాసరావు, ఈదర త్రినాద్,క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షులు కురంగి అనిల్,కొమ్మినేని కోటేశ్వరావు, శ్రీపతి రాంబాబు, చిక్కాల శివ ,బుల్లా కుమార్ బాబు ,శేషాద్రి సాంబశివరావు, శౌంఠినేని అనిల్, క్షత్రి పూర్ణ సింగ్,చిరుమామిళ్ల వెంకట్ ,తథితరులు పాల్గున్నారు.

## మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుకు శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ కమిషనర్ సిహెచ్ గోవిందరాజులు



**చిలకలూరిపేట, మే7( ఆంధ్రపత్రిక):** పట్టణంలో శుక్రవారం ఉదయం మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు సొంత నివాసంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ గోవిందరాజులు వారి సిబ్బంది మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ను కలిసి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ రమణ, ఏఈ లు, ఆర్వో, శానిటైజింగ్ ఇన్స్పెక్టర్స్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్తిపాటి,ఆయన సతీమణి వెంకట కుమారిని మర్యాదపూర్వకంగా కలిసిన ఉషారాణి





**చిలకలూరిపేట మే 7 (ఆంధ్రపత్రిక):** పట్టణంలో శుక్రవారం ఉదయం మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సొంత నివాసంలో పట్టణ మున్సిపాలిటీ మెప్మా సిబ్బంది సి.ఐ.టి.యు యూనియన్ ప్రెసిడెంట్ ఉషారాణి వారి సభ్యులు మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన సతీమణి ప్రత్తిపాటి వెంకట కుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. తదనంతరం ఇరువురిని పూలదండలు,శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ మెప్మా సిబ్బంది ఆర్పీల సి.ఐ.టి.యు యూనియన్ ప్రెసిడెంట్ పోనుగుబాటి ఉషారాణి మాట్లాడుతూ మహిళలంటే వంటింటికే పరిమితం కాదు వారు కూడా కుటుంబాన్ని పోషించగల శక్తి ఉందని ఆమె అన్నారు. డ్వాక్రా అనే రెండు అక్షరాల తో ఈ పథకాన్ని 1982లో అమల్లోకి తెచ్చారు. ఈ పథకం ప్రవేశపెట్టిన ముఖ్య ఉద్దేశం రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులపై లింగ వివక్షను నిర్మూలించి, వారిని అభివృద్ధి చేయడానికి డ్వాక్రా(డెవలప్మెంట్ ఆఫ్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ ఇన్ రూరల్ ఏరియాస్) కార్యక్రమాన్ని రాష్ట్రంలో ప్రారంభించారు. మొదటగా దీన్ని దేశవ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టుగా 50 జిల్లాల్లో ప్రారంభించారు, ఆ తర్వాత దేశంలోని అన్ని జిల్లాలకు విస్తరించారు అని ఉషారాణి అన్నారు. డ్వాక్రా పథకం మహిళల జీవన పరిస్థితులను మెరుగుపరచడం, తద్వారా పిల్లల ప్రాథమిక సామాజిక సేవలకు స్వయం ఉపాధి కల్పించడం, డ్వాక్రా గ్రూపు మహిళలకు సంబంధిత రంగాల్లో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పించి రుణ సౌకర్యం ఏర్పర్చ డం ద్వారా వారికి జీవనోపాధి కల్పించడమే కాకుండా వారిలో మానసిక స్థైర్యాన్ని నింపడమే లక్ష్యంగా అమల్లోకి తెచ్చారు అని ఉషారాణి అన్నారు. గ్రూపులుగా ఏర్పర్చి సమూహంగా కార్యకలాపాలు నిర్వహించడం ద్వారా సంఘంలో వారి ప్రతిష్ట పెరగడమే కాకుండాగ్రామీణ మహిళల్లో పొదుపు పెరుగుతుంది,తద్వారా దేశం కూడా అభివృద్ధి చెందుతుంది అని ఉషారాణి అన్నారు. డ్వాక్రా గ్రూపుల ద్వారా మహిళల వ్యక్తిగత ఆదాయం పెరగడమే కాకుండా కుటుంబాల కనీస అవసరాలు తీరి సంఘంలో వారి స్థానం సుస్థిరమవుతుంది అని ఉషారాణి అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న యూనియన్ సభ్యులు షేక్ మౌలా,అనంతలక్ష్మి ,లక్ష్మీరాజ్యం,షేక్ రిహానా, పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ యువత భవిష్యత్తు కోసం చంద్రబాబు తోలి సంతకం

### గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు : జూన్ 7( ఆంధ్రపత్రిక ):** యువత భవిష్యత్తు కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు తోలి సంతకం మెగా డిఎస్సి పైన పెట్టనున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి తెలిపారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం వద్ద యువత ఆధ్వర్యంలో గళ్ళా మాధవి ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భముగా భారీ కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భముగా గళ్ళా మాధవి మాట్లాడుతూ... జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఈ రాష్ట్రం చాలా వెనుకబడి పోయిందని, ఒక్క విశ్వవిద్యాలయం, ఒక్క పరిశ్రమ తీసుకొనిరాలేదని, ఏపీ యువతకు ఫిష్ ఆంధ్ర, వాలంటీర్ల ఉద్యోగాలు ఇచ్చి భవిషత్తును సర్వనాశనం చేసారని గళ్ళా మాధవి ఆవేదన వ్యక్తం చేసారు. 2014 నాటి నుండి 2019 వరకు చంద్రబాబు పాలనలో పరిశ్రమలు ఏపీకి క్యూ కట్టేవని, నేడు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్వర్ణయుగం మొదలు అయ్యిందని హర్షం వ్యక్తం చేసారు..మాజీ మంత్రి మాకినేని పెద్దరత్తయ్యను గుంటూరులోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి, రామచంద్రరావు.ఈ సందర్భముగా తన గెలుపు కోసం దశ,నిర్దేశం చేసినందుకు మాధవి ధన్యవాదాలు తెలుపుకున్నారు.

## పవన్ కల్యాణ్ గొప్ప ప్రజా పోరాట యోధుడు పవన్ కల్యాణ్ త్యాగాల ఫలమే కూటమి ఘన విజయం

**-ఎన్నికల ప్రక్రియలో జనసైనికుల పోరాటం స్ఫూర్తి దాయకం-మోదీ చంద్రబాబు పవన్ కల్యాణ్ లు త్రిమూర్తులుగా రాష్ట్రాన్ని కాపాడారు- పవన్ కల్యాణ్ రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్.**



**గుంటూరు , జూన్ 7( ఆంధ్రపత్రిక ):** సమాజంలో అన్యాయాలకు, నిరాదరణకు గురవుతూ దిక్కుతోచని స్థితిలో దేవుడి మీదే భారం వేసి బ్రతుకును వెళ్లదీస్తున్న ఎంతోమంది పీడిత, తాడిత ప్రజలకు జనసేనాని పవన్ కల్యాణ్ అండగా నిలిచారని పవన్ కల్యాణ్ రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ అన్నారు. పవన్ కల్యాణ్ అభినవ వివేకానందుడని గొప్ప ప్రజా పోరాటయోధుడంటూ ఆయన కొనియాడారు. జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి శుక్రవారం హరిప్రసాద్ ను కలిసి జిల్లాలో కూటమి విజయానికి జనసేన పార్టీ శ్రేణులు చేసిన కృషిని వివరించారు. క్షేత్రస్థాయిలో జనసైనికులు, వీరమహిళలు కూటమి అభ్యర్థుల విజయానికి పడ్డ కష్టాలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. జనసేన ఓట్లు పూర్తిగా కూటమికి బదిలీ అయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా బాగా కష్టపడ్డావు వెల్డన్ అంటూ ఆళ్ళహరిని హరిప్రసాద్ భుజం తట్టి అభినందించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ నిరంతరం రాష్ట్రం గురించి , ప్రజల గురించి ఆలోచిస్తుంటారని, ఆయన తపనంతా ఈ దేశం గురించేనని కొనియాడారు. పవన్ కల్యాణ్ ఏంచేసినా రాష్ట్రం కోసమేనని ప్రజలు విశ్వసించారని అందుకే చారిత్రాత్మక గెలుపుని కూటమికి అందించారన్నారు. రాష్ట్రం నుంచి వైసీపీని తరిమేయాలంటూ పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపునందుకొని జనసైనికులు కసిగా పనిచేసారన్నారు. చంద్రబాబు ముందుచూపు, పవన్ కల్యాణ్ త్యాగాల ఫలమే కూటమి భారీ విజయమంటూ వ్యాఖ్యానించారు. వైసీపీ అరాచకత్వంతో ఐదేళ్లుగా రాష్ట్రం విలవిలాడిందన్నారు. ఈ నేపథ్యంలో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ లు త్రిమూర్తుల అవతారమెత్తి రాష్ట్రాన్ని కాపాడారన్నారు. వైసీపీ ఓటమితో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారని, కూటమి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని హరిప్రసాద్ అన్నారు. అనంతరం జనసేన పార్టీ ప్రోగ్రామింగ్ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్ ను ఆళ్ళ హరి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెల్లి యువత నాయకులు సోమి ఉదయ్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ షర్ఫుద్దీన్, నాజర్ వలి, మారాసు అన్వేష్, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## దండకారణ్యంలో మారణ హెూమాన్ని ఆపేయాలి ఆపరేషన్ కగారును తక్షణం నిలిపివేయాలి

### పౌర హక్కుల సంఘం తెలంగాణ అధ్యక్షులు సోగడం లక్ష్మణ డిమాండ్



**గుంటూరు : జూన్ 7( ఆంధ్రపత్రిక ):** కేంద్ర ప్రభుత్వం చత్తీస్ గడ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ సంవత్సరం మొదటి నుండే ఒకవైపు శాంతి చర్చలు అంటూనే మరోవైపు ఆదివాసులను సవాల్గా మారుస్తూ గుర్తించటానికి వీలుకాని విధంగా చిత్రహింసలతో హత్య చేస్తున్న వైనాన్ని ప్రజలు ప్రజాస్వామిక వాదులు ముక్తకంఠంతో ఖండిస్తూ ఏకతాటిపై మద్దతు ప్రకటించి ప్రభుత్వ వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని పౌర హక్కుల సంఘం తెలంగాణ అధ్యక్షులు సోగడం లక్ష్మణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బ్రాడీపేట సిపి ఎం కార్యాలయం సమావేశంలో మందిరంలో సివిల్ లిబర్టీస్ కౌన్సిల్ (సి ఎల్ సి) ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో "దండకారణ్యంలో మారిన కాండ, ఆపరేషన్, కార్పొరేట్ హిందుత్వ ఫాసిజం"అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న లక్ష్మణ మాట్లాడుతూ ఆదివాసి కమ్లి కన్నతల్లి కూడా తన బిడ్డ శవాన్ని గుర్తించలేనంతగా పోలీసులు వందలాదిమందిని హింసించి శవాలుగా మార్చడం పోలీసుల అమానవీయ క్రూరత్వానికి అద్దం పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీలను సేవలుగా మార్చి వారి పోరాటాన్ని నిశ్శబ్దం చేసి అటవీ సంపదను కార్పొరేట్లకు అందించడమే ఆపరేషన్ కగారు లక్ష్యంగా ప్రభుత్వం ఎంచుకున్నదని తీవ్రంగా విమర్శించారు. సామ్రాజ్యవాదుల కార్పొరేట్ల పెట్టుబడుల కోసమే ఆదివాసి ప్రాంతాలను సాయుధ సరిహద్దు భద్రత దళాలతో నింపేసి సరిహద్దు సైనిక ప్రాంతాలుగా మార్చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2023 సంవత్సరంలో చత్తీస్ గడ్ లో పోలీస్ ఎన్కౌంటర్లలో 22 మంది మావోయిస్టులు చనిపోతే ఈ సంవత్సరం గత సంవత్సరం నాలుగు నెలల కాలంలోనే 115 మంది మావోయిస్టులు ఎన్కౌంటర్లలో కాల్చి చంపారని 400 మందిని అరెస్ట్ చేసి జైలుకు పంపామని రాష్ట్ర పోలీస్ అధికారులు పేర్కొన్నారన్నారు.

పౌర హక్కుల సంఘం తెలంగాణ కార్యదర్శి ఎన్ నారాయణ మాట్లా డుతూ ఈ సంవత్సరం జనవరి 1 న బీజపూర్ జిల్లా గంగలూరు మగ్గం గ్రామం లో జరిపిన పోలీసులు విచక్షణారహితంగా కాల్పు లు జరుపగా ఆరు నెలల పసిపాప చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా పాలకులు ప్రజాస్వామ్యంలో విఫలమవుతున్న స్థితిలో బుద్ధి జీవులు మేధావులు కలిసి ప్రజా పోరాటాలు ప్రజల మౌలిక సమస్యలకు పరిష్కారం అని నిరూపిస్తుంటే మన ప్రభుత్వాలు మార్క్సిస్టులు మావోయిస్టులు లేని భారత్ను నిర్మాణం చేయాలని వికసిత్తు భారత్ నినాదంతో కార్పొరేట్ సెక్యూరిటీ లో భాగంగా ఆపరేషన్ కగారు పేరుతో లక్షలాదిమంది సాయుధ బలగాలు ఆదివాసీలపై అణిచివేతను కొనసాగిస్తూ సామ్రాజ్యవాద అనుకూల భారత్ ను నిర్మిస్తూ ఆదివాసీల జీవించే హక్కును రద్దు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.సిఎల్సి ఏపీ ప్రధాన కార్యదర్శి చిలుక చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలని, చత్తీస్ గడ్ ఆదివాసీల హత్యాకాండ పై మావోయిస్టుల బూటకపు ఎన్కౌంటర్ పై సుప్రీంకోర్టు జడ్జి చే న్యాయవిచారణ జరపాలని పేసా చట్టాన్ని, రాజ్యాంగంలోని ఐదు ఆరు షెడ్యూల్ను అమలు చేయాలని, శాంతి చర్చలకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తూ శాంతి చర్చలు కొనసాగించాలని, సాయుధ మిలిటరీ క్యాంపులు అన్నిటిని ఎత్తివేయాలని, ఛత్తీస్గడ్ ప్రాంతంలో హక్కుల సంఘాలకు, ప్రజా సంఘాలకు, ప్రజాస్వామ్య వాదులకు నిర్ధారణ చేయటానికి అవకాశం కల్పించాలని తీర్మానాల డిమాండ్స్ ను ఆమోదించారు. కార్యక్రమానికి వి చిట్టిబాబు అధ్యక్షత వహించగా విప్లవ రచయిత సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరసవల్లి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మస్తాన్ వలి, పలు ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను సత్వరంగా పరిష్కరిస్తా అంగన్వాడి కార్యకర్తలకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హామీ



**తిరువూరు జూన్ 7 ( ఆంధ్రపత్రిక):** అంగన్వాడి కార్యకర్తలను ఆయాలను ఉద్దేశించి తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శుక్రవారంమాట్లాడుతూ మీకు ఏ సమస్య వచ్చినా ఒక్క మెసేజ్ రూపంలో కానీ ఫోన్ తో కానీ తెలియజేయండి మీ సమస్యలను నేను పరిష్కరిస్తాను అంటూ భరోసా కల్పించారు. అంగన్వాడి కార్యకర్తలు ఆయాలతో సమావేశమైన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు మీ విధులను సక్రమంగా నిర్వర్తించండి నా దగ్గరకు వచ్చేటప్పుడు బొకేలు పూలు శాలువాలు తీసుకురావద్దు దయచేసి అర్థం చేసుకోగలరు నేను రాజకీయాలకు అతీతంగా పనిచేస్తాను రాజకీయాలు చేయను ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి శాయ శక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరువూరు నియోజకవర్గస్థాయి అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును శుభాకాంక్షలు తెలిపిన తిరువూరు సిఐ షేక్ అబ్దుల్ నబి



**తిరువూరు జూన్ 7 (ఆంధ్రపత్రిక):** తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును శుక్రవారం సీఐ షేక్ అబ్దుల్ నబీ మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలి యజేశారు. వీరితోపాటు గంపలగూడెం విస్సన్నపేట తిరువూరు ఎ. కొండూరు ఎస్ఐలు పాల్గొన్నారు.వీరికి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గస్థాయిలో శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన పోలీస్ సిబ్బందికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రత్తిపాటిని మర్యాదపూర్వకంగా కలిసిన యడ్లపాడు పి.ఎస్ ఎస్ఐలు





**యడ్లపాడు మే 7 (ఆంధ్రపత్రిక):**మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సొంత నివాసంలో శుక్రవారం ఉదయం యడ్లపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ లు మర్యాదపూర్వకంగా కలిసి బొకేల తో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యడ్లపాడు పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జగన్ ముఠా దోచుకున్న రూ. 8 లక్షల కోట్లు కక్కిస్తాం: ప్రత్తిపాటి



**చిలకలూరిపేట మే ,7 (ఆంధ్రపత్రిక):** ఒక్క ఛాన్స్ అంటూ వచ్చి అయిదేళ్లలో 8 లక్షల కోట్ల రూపాయలకు పైగా దోచేసిన వైకాపా దోపిడీ మొత్తాన్ని తిరిగి కక్కిస్తామని స్పష్టం చేశారు మాజీమంత్రి, చిలక లూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. ల్యాండ్,శాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం, సహా అనేక రూపా ల్లో జగన్ ముఠా ప్రజాధనాన్ని కొల్లగొ ట్టిందన్నారాయన. అందుకు సంబంధించి లెక్కలు తేల్చే పని కొత్తప్రభుత్వ కొలువుదీరగానే మొదలవుతుందని తెలిపారు. అనంతరం మాట్లాడిన ప్రత్తిపాటి వైకాపా రూ. 8లక్షల దోపిడీపై ప్రతిపక్షం లోనే ఉండగానే పూర్తి వివరాలతో తెలుగుదేశం పార్టీ తరఫున ఛార్జ్షీట్ విడుదల చేశామని గుర్తు చేశారు. జే-బ్రాండ్స్ మద్యం కమీషన్ల రూపంలోనే లక్ష కోట్లకు పైగా దండుకున్నట్లు అనుమానాలు ఉన్నాయని, దానికి సంబంధించి నిగ్గు తేల్చే పని సీఐడీ ద్వారా ఇప్పటికే ప్రారంభమైందన్నారు.

దాని తర్వాత రూ. లక్ష కోట్ల విలువైన అసైన్డ్ భూముల కుంభకోణం ఉందని, దానిలో వైకాపా నేతల నుంచి కొంతమంది సీనియర్ అధికారుల పాత్ర పైనా విచారణలు తప్పవన్నారు ప్రత్తిపాటి. జగన్ బినామీ సంస్థ ఇండోసోల్ కుంభోణం, విద్యుత్ ఒప్పందాలు, టీడీఆర్ బాండ్లలో గోల్మాల్ ద్వారా కూడా వేల కోట్లు దోచేశారని ఆయన ఆరోపించారు. విశాఖభూముల కుంభకోణం మరో రూ.40వేల కోట్ల వరకు లెక్క తేలుతోందన్నారు. వీటన్నింటిలో ప్రమేయం ఉన్న వైకాపా నాయకులు, అధికా రులు తప్పక చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటందని ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు.

# నూతన అధ్యక్షులుగా మహబూబ్ బాషా

## -అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నిక



**ఎమ్మిగనూరు. జూన్ 7(ఆంధ్రపత్రిక):** పట్టణ రేషన డీలర్ సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేయగా అందులో శుక్రవారంపట్టణ రేషన్ డీలర్ సంఘం నూతన అధ్యక్షులుగా ఎస్. మహబూబ్ బాషా ను కమిటీ సభ్యులు ఎంపిక చేశారు. పట్టణ రేషన్ డీలర్ల సంఘం నూతన అధ్యక్షులుగా. ఉపాధ్యక్షులుగా నూతన కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ రేషన్ డీలర్ల వ్యవస్థ ను గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా తుగ్లక్ పాలన చేసిందన్నారు. చాలా నిర్వీర్యం చేసిందన్నారు. ఎం డి యు ఆపరేటర్లు రేషన్ పంపిణీ చేయగా వచ్చిన కమిషన్ పై మాత్రమే ఆధారపడి జీవనం కొనసాగించాం అన్నారు. ఇంటి వద్దకే నిత్యవసర సరుకులు డోర్ డెలివరీ అంటూ వదలకుండా విక్రమార్కుడు వాహనాలను తిప్పుకుంటూ చాలామందికి సరుకులు అందేవి కావన్నారు. వీధిలో ఒకచోట వాహనాన్ని ఆపి పంపిణీ చేపట్టడంతో, సందుల్లో ఉన్నవారికి వాహనం వచ్చినది లేనిది తెలియక సరుకులు అందక ఇబ్బంది పడేవారు. దీంతో ఎం డి యు ఆపరేటర్లు పంపిణీ పై డీలర్ల కమిషన్ ఆధారపడి ఉండటంతో, చాలీచాలని కమీషన్తో చాలా ఇబ్బందులు పడే వారం అన్నారు. ఎండియులకు మాత్రం రేషన్ పంపిణీ కమిషన్ తో సంబంధం లేకుండా గౌరవ వేతనం అందించారన్నారు. ఇలా గత ప్రభుత్వం , అనాలోచిత డోర్ డెలివరీ కార్యక్రమాల వలన, రేషన్ డీలర్ల పరిస్థితి చాలామంది డీలర్లకు, 6000 నుంచి 7000 వరకు కమిషన్ తో సరి పెట్టుకున్నారు. కమిషన్ లో రేషన్ డీలర్ల షాపు బాడుగలకు, విద్యుత్ చార్జీలకు, ఖర్చులు పోగా డీలర్ కు చివరికి రెండు నుంచి మూడు వేల వరకు మాత్రమే మిగిలిందన్నారు.

దీంతో కుటుంబం గడవక పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు,. యువ గళం పాదయాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డీలర్ల పరిస్థితులపై నారా లోకేష్ కు మెమోరాండం ద్వారా మొరపెట్టుకున్నామన్నారు. కాబట్టి రేషన్ డీలర్లకు కూడా రాష్ట్రవ్యాప్తంగా ఒకే కమిషన్ ఒకే రేషన్ పద్ధతిని కానీ, గౌరవ వేతనం కానీ అందించాలని డిమాండ్ చేశామన్నారు,. కాబట్టి రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరిస్తారని, ఈ కొత్త ప్రభుత్వాన్ని విన్నవించుకొనుచున్నారు. గత 40 సంవత్సరాల నుంచి సేవలందించిన డీలర్లను గుర్తించి డీలర్ వ్యవస్థను నిర్వీర్యం చేయకుండా కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వానికి. శాసనసభ్యులు డాక్టర్ బి వి జగనేశ్వర రెడ్డి కి సమస్యలపై వివరించామన్నారు. అనంతరం ఎమ్మెల్యే కు శుభాకాంక్షలు తెలియజేసి శాలువా కప్పి పూల దండలతో సన్మానించడం జరిగింది. అనంతరం రేషన్ డీలర్ల సంఘం నూతన కమిటీలో సెక్రటరీగా ఎండి షేక్, జాయింట్ సెక్రటరీగా అఫ్జల్ భాష, ట్రెజరరీగా కాజా, సభ్యులుగా నటరాజ్, తాయప్ప, ఫోటో శీనా, చంద్రశేఖర్, శివ కుమార్, పాల ఈరన్న, నాగూర్ భాష, రాఖీభూ, సురేంద్ర గౌడ్, రంగన్న, తదితరులు ఎన్నికయ్యారు.

# మౌంట్ కార్మెల్ హై స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

**ప్రభుత్వ నియమ నిబంధనలు తుంగలో తొక్కుతూ అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న మౌంట్ కార్మెల్ హైస్కూల్ గుర్తింపు రద్దు చేయాలి-ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఈరేష్ డిమాండ్ చేశారు.**






**మంత్రాలయం జూన్ 7(ఆంధ్రపత్రిక):** కోసిగి మండల కేంద్రమైన కోసిగిలోని ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న మౌంట్ కార్మెల్ హై స్కూల్ ను గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు శుక్రవారం పాఠశాల ముందు ధర్నా చేశారు.అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఈరేష్ కోసిగి మండల కార్యదర్శి అంజి మాట్లాడుతూ మౌంట్ కార్మెల్ హై స్కూల్ యాజమాన్యం కోసిగి మండలంలో విద్యను వ్యాపారంగా మార్చారు.అక్రమ అడ్మిషన్లు నిర్వహించడమే కాకుండా పాఠశాల పేర్లతో ప్రింట్ చేయించిన పుస్తకాలు అమ్ముతున్నారు.

అలాగే విద్యార్థుల యూనిఫామ్ పేరు తో యాజమాన్యం వేలకు వేలు వసూలు చేస్తున్నారు.అలాగే ఒక్క ఎల్కేజీ విద్యార్థికి అడ్మిషన్ ఫీజ్ 2000.వేల రూపాయలు స్కూల్ ఫీజ్ 10000.వేల రూపాయలు స్కూల్ ఫంక్షన్ డే కోసం 1000. రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు.వెంటనే ఎంఈఓ నాగేశప్ప ఫోన్ ద్వార వివరించడం జరిగింది వెంటనే. ఎంఈఓ స్పందించి మౌంట్ కార్మెల్ హై స్కూల్ దగ్గరికి వచ్చారు.ఆయనా కళ్ళు ముందే అడ్మిషన్స్ చేస్తున్న వారిని ఏఐఎస్ఎఫ్ నాయకులు చూపించారు.అలాగే మౌంట్ కార్మెల్ హై స్కూల్ పేరుతో ప్రింట్ చేసిన పుస్తకాలను ఎంఈఓకు చూపి ంచారు. వెంటనే ఎంఈఓ మౌంట్ కార్మెల్ హై స్కూల్ హెచ్ఎం ను పిలిపించి ఏ నామ్స్ పర ంగా అడ్మిషన్స్ నిర్వహిస్తున్నారని పాఠశాల ముద్రించిన పుస్తకాలను ఎలా అమ్ముతారని విద్యార్థుల తల్లిదండ్రులతో యూనిఫామ్ పేరుతో 2000.వేల రూపాయలు ఎలా వసూలు చేస్తారని ప్రశ్నించగా మౌంట్ కార్మెల్ హై స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ నియమ నిబంధనలు మాకు ఉండవు సొంతంగా పాఠశాల నామ్స్ పరంగా అడ్మిషన్ చేస్తున్నామని సమాధానమిచ్చారు.ఎంఈఓ నాగేషప్ప ఏఐఎస్ఎఫ్ నాయకులకు మౌంట్ కార్మెల్ హై స్కూల్ యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు జిల్లా విద్యాశాఖ అధికారి డీఈవో దృష్టికి తీసుకెళ్తామని వారికి హామీ ఇచ్చారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా విరమించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కోసిగి మండల నాయకులు మల్లికార్జున గురుస్వామి నరసింహులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల సౌకర్యార్థం నూతన వాటర్ ప్లాంట్ ఏర్పాటు



**హిందూపురం, జూన్ 7 ( ఆంధ్రపత్రిక ):** రోటరీ క్లబ్ ఆఫ్ హిందూపురం, రోటరీ క్లబ్ ఆఫ్ ప్లైయిన్స్‌బోరో, నార్త్ అండ్ సౌత్ బ్రున్స్‌విక్, న్యూజెర్సీతో కలిసి ప్రయాణికులకు సురక్షితమైన తాగు నీటి సరఫరాను నిర్ధారించడానికి పట్టణంలోని ఏ.పీ.ఎస్.ఆర్. టి.సి బస్టాండ్ లో రివర్స్ ఆస్మాసిస్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. యూనిట్ ఏర్పాటు కోసం క్లబ్ దాదాపు రూ.1.8 లక్షలు వెచ్చించింది. డిపో మేనేజర్ పి.శ్రీకాంత్, స్టాఫ్ చెన్నప్పరెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ హిందూపురం అధ్యక్షులు గిరిధర్ టికారే, సెక్రటరీ ఎం.ఎ.కల్యాణ్ కుమార్, అసిస్టెంట్ గవర్నర్ జి.తిమ్మారెడ్డి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎ.శ్రీధర్ గౌడ్, ఫ్రీజర్ స్పాన్సర్ నంబూరి సుమంత్, రోటేరియన్ సభ్యులు అందరు పాల్గొని యూనిట్ ను ప్రారంభించారు. మన చుట్టూ నివసించే ప్రజల కోసం రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాలని కోరుకుంటుందని అధ్యక్షుడు అన్నారు. యూనిట్‌ను ఏర్పాటు చేసిన రోటేరియన్లందరికీ డిపో మేనేజర్ కృతజ్ఞతలు తెలిపారు.

# చంద్రప్రభ వాహనంపై చిద్విలాసంగా ఇంద్ర వరదుడు





**యాదమరి, జూన్,7 (ఆంధ్రపత్రిక):** యాదమరి మండలం కేంద్రం లో గంగా, యమున, సరస్వతి, మూడు నదులు కలిసే త్రివేణి సంగమంలో కొలువై ఉన్న శ్రీ వరదరాజుల స్వామి ఆలయంలో శ్రీ ఇంద్ర వరదరాజల స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలో బాగంగా శుక్రవారం ఉదయం ధ్వజా రోహణం నిర్వహించి రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామి వారిని మాడా వీధిల్లో ఊరేగించారు. ఉద యం మూలవర్లకు తోమాల సేవ, సహస్రనామార్చన, పుష్పకైంకర్యం,విషేశ ఆభరణాలతో ధ్వజారో హణం నిర్వహించారు. అనంతరం అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని గరుడ ధ్వజారోహణం శాస్త్రోక్తంగా ఆలయ పండితులు వరదాచార్యులు వరదరాజుల స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు. గ్రామస్తులు స్వామి వారికి కర్పూర మంగళ నీరాజనాలు, ఫల పుష్పాదులతో స్వామివారికి భక్తితో సమర్పించి దర్శించుకున్నారు . బ్రహ్మోత్స వాలలో నేడు...శనివారం ఉదయం - మూలవర్లకు పుష్ప కైంకర్యం ,సప్రంలో ఉత్సవం , అలంకారాభిషేకం,రాత్రి - హంస వాహనం.

# కూటమి అభ్యర్థి గెలుపుకి కృషిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

**మోతుకురి సోమశేఖర్ నాయుడు**



**ఐరాల జూన్ 7 (ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా ఐరాల మండలం సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన వారందరికీ పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం కార్యనిర్వాహక కార్యదర్శి మోతుకూరి సోమశేఖర్ నాయుడు ధన్యవాదాలు తెలియజేశారు. పూతలపట్టు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థ కలికిరి మురళీమోహన్ నీ అఖండ విజయంతో గెలిపించిన పూతలపట్టు నియోజకవర్గం ఓటర్లకు నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు పూతలపట్టు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యవర్గ కమిటీ సభ్యులు భూతి ఇన్చార్జీలకు ఇన్చార్జీలకు క్లస్టర్ ఇన్చార్జిలకు మండల పార్టీ అధ్యక్షులకు ప్రధాన కార్యదర్శులకు కార్యవర్గ కమిటీ సభ్యులకు నియోజకవర్గ నాయకులకు రాష్ట్ర పార్టీ నాయకు లకు, మరియు నియోజకవర్గ జనసేన బిజెపి పార్టీ నాయకులకు కార్యకర్తలకు , పూతలపట్టు నియోజకవర్గం జిల్లా తెలుగుదేశం పార్టీ తరపున ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు,

# మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్ చల్..!



**యాదమరి, జూన్ 7 : (ఆంధ్రపత్రిక):** తాగిన మైకంలో సెల్ టవర్ ఎక్కి హల్ చల్ చేసిన సంఘ టన మండల పరిధిలోని కోనాపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు కోనాపల్లి గ్రామానికి చెందిన మనోహర్ నాయుడు (58) మద్యం మత్తు బానిసై స్థానికంగా ఉండే సెల్ టవర్ ను శుక్రవారం సాయంత్రం ఎక్కి రాష్ట్రానికి చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు వచ్చి మాట్లాడే వరకు దిగనని భీష్మించుకుని కూర్చున్నాడు. స్థానిక ఎస్సై రామాంజనేయులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది పలుమార్లు అతనితో మాట్లాడి సెల్ టవర్ నుంచి దింపి అదుపులోకి తీసుకోవడం తో కథ సుఖాంతం అయింది.

# కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టాభిషేకం కోసం 42 వ డివిజనులో తెదేపా నాయకులు ఆధ్వర్యంలో జైత్రయాత్ర



**విజయవాడ పశ్చిమ,జూన్ 7, (ఆంధ్ర పత్రిక) :** ఎన్డీయే కూటమి సారధ్యంలో రాష్ట్ర చరిత్ర ను సువర్ణాక్షరాలతో లిఖించిన కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు పట్టాభిషేకం శుభ ఘడి యలకి ముందస్తు గా స్వాగతం పలుకుతూ శుక్రవారం జైత్రయాత్ర నిర్వహించారు. రాష్ట్రంలో రానుంది రామరాజ్యమే కావాలని ఏకపక్షంగా తీర్పు ఇచ్చిన రాష్ట్రంలో ప్రతి ఓటరుకు కృతజ్ఞతలు తెలుపుతూ సాగిన ఈ విజయోత్సవ ర్యాలీ లో వందలాది మంది తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు.

42వ డివిజన్లో తెలుగుదేశం పార్టీ విజయోత్సవ వేడుకలు సందర్భంగా శివాలయం సెంటర్లో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించటం జరిగింది. అలాగే డివిజన్ మొత్తం ఘనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు .

ఈ కార్యక్రమంలో 42 వ డివిజన్ తెలుగుదేశం అధ్యక్షులు శివాజీ ముదిరాజ్, 41వ డివిజన్ తెలుగుదేశం అధ్యక్షులు పత్తి నాగేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా రజక సంఘం అధ్యక్షులు ముది గౌండ శివ, 42వ డివిజన్ తెలుగుదేశం సెక్రెటరీ పెద్ది సతీష్, డివిజన్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం ,రెహమాన్ ,నజ్జు శివ ప్రకాష్, టిఎన్టియుసి అధ్యక్షులు హనుమంతరావు, గజపతి, దివాకర్ ,శామ్, విజయ, సంధ్య, భవానిపురం సీనియర్ నాయకులు పిట్టల సాంబశివరావు తదితరులు పాల్గొని విజయోత్సవ వేడుకలు జయప్రదం చేశారు.

# పసుపు మయంగా మారిన గంపలగూడెం కట్టలు తెంచుకున్న వీరాభిమానం

**విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు**



**తిరువూరు ,జూన్ 7 (ఆంధ్రపత్రిక):** సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించిన సందర్భంగా శుక్రవారం తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలిక పూడి శ్రీనివాసరావు తిరువూరు నియోజకవర్గంలోని గంపలగూడెం మండలంలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిమానులు మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని డీజే లతో తీన్మార్ డాన్స్ స్టెప్పులతో గంపలగూడెం దద్దరిల్లిపోయింది. ఆనందోత్సవాలతో యువత బాణసంచా పేల్చి వారి వీరాభిమానాన్ని చాటుకున్నారు. గంపలగూడెం రహదారులన్నీ పసుపు జెండాలతో కార్యకర్తల సంచారంతో కిక్కిరిసిపోయింది. ఐదేళ్ల సైకో పాలనతో విసిగి వేసారిన ప్రజలు ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టారు. ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ఈ రాష్ట్రం అన్ని రంగాల్లో దివాళా తీసిందన్నారు. ఈ విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తనదైన స్టైల్లో నాయకులతో కార్యకర్తలతో కలిసి డ్యాన్స్ స్టెప్పులు వేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ మంత్రి సీతక, ముఖ్య అతిథిగా డ్రామా జూనియర్స్ సీజన్ 7

**కర్నూల్, జూన్ 7 : (ఆంధ్రపత్రిక):** ఎప్పటికప్పుడు కొత్తకొత్త షోలు, సీరియల్స్తో రెట్టింపు వినోదాన్ని అందించే జీ తెలుగు ఈ వారం మరో రెండు సర్ ప్రైజ్ అంది చేందకు సిద్ధమైంది. అత్యంత ప్రేక్షకాదరణ పొందిన జీ తెలుగు డ్రామా జూనియర్స్ కొత్త సీజన్ ప్రారంభం కానుంది. విజయవంతంగా 6 సీజన్లు పూర్తిచేసుకున్న జి తెలుగు డ్రామా జూనియర్స్ 7వ సీజన్ ఈ ఆదివారం జూన్ 9న, సా. 6:00 గంటలకు! ప్రతి ఆదివారం రాత్రి 9:00 గంటలకు. అంతే కాదు భావోద్వేగం నిండిన కథతో ప్రేక్షకుల హృద యాలను తాకే కథతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ మేఘ సందేశం, జూన్ 10 నుంచి




ప్రారంభం, సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు రాత్రి 7:30 గంటలకు!! ప్రసా రం కానున్నది.జీ తెలుగు పాపు లర్ షో డ్రామా జూనియర్స్ సీజన్ 7ను ఈ ఆదివారం గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్ తో ప్రారంభించనుంది. కొన్నేళ్లుగా అందరి హృదయాలను గెలుచుకున్న పాపులర్ కిడ్స్ రియాలిటీ షో ఏడో సీజన్ కోసం తెలుగు బుల్లితెరపైకి రీఎంట్రీ ఇస్తోంది. డ్రామా జూనియర్స్ సీజన్ 7కు కూడా సీనియర్ నటి జయప్రద జడ్జిగా కొనసాగనున్నారు. టాలీవుడ్ కమెడియన్, దర్శకుడు బలగం వేణు, అందాల నటి పూర్ణ కూడా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి పిల్లల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించనున్నారు. ఆరు సీజన్లను విజయవంతంగా పూర్తి చేసుకున్న జి తెలుగు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అంతటా ఉన్న దాగి ఉన్న ప్రతిభావంతులను తెరపైకి తీసుకురా వడానికి సిద్దంగా ఉంది. చిన్న పిల్లలను కళాకారులుగా ఎదగడానికి, ప్రేక్షకులను అలరించడానికి జీ తెలుగు అద్భుత అవకాశాన్ని అందిస్తోంది. ఇక ఈ సీజన్ కి ప్రముఖ నటుడు, నిర్మాత శ్రీరామ్ వెంకట్ వ్యాఖ్యాతగా, పడమటి సంధ్యారాగం సీరియల్ అధ్య, రామలక్ష్మి మెంటర్స్‌గా వ్యవహరిస్తున్నారు.

# ఘనంగా హులిగమ్మ అమ్మవారి షష్ఠమ(6వ) జాతర మహోత్సవం

**జ్ఞాన బ్రహ్మ శ్రీ గుంటుపల్లి శ్రీనివాసరావు గురు స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు - తెలుగు రాష్ట్రాల నుండి వందలాదిమంది భక్తుల రాకపోకలు- భక్తజన సంద్రంగా గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం "శేకూరు"గ్రామంలోని "ధర్మ శాస్త్ర పీఠం ట్రస్ట్"**





**గుంటూరు,జూన్ 7, (ఆంధ్రపత్రిక) :** గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం"శేకూరు"గ్రామం"ధర్మ శాస్త్ర పీఠం ట్రస్ట్" వారి ఆలయ సముదాయాలలో కొలువైయున్న కోరిన కోరికలు తీర్చే తల్లి, కొంగు బంగారమై వెలుగొందుతున్న తల్లి కుటుంబ సౌఖ్యాన్ని సుఖశాంతులను కలుగజేయుటకు వచ్చిన తల్లి "హులిగమ్మ" అమ్మవారని జ్ఞాన బ్రహ్మ శ్రీ గుంటుపల్లి శ్రీనివాసరావు గురుస్వామి పేర్కొన్నారు. అమ్మవారి 6 వ సంవత్సర జాతర మహోత్సవములు ఆదివారం నుండి ప్రారంభం కాగా శనివారం వరకు జరుగుతాయని భక్తులకు సూచించారు. గత 5 రోజులుగా వందలాది మంది భక్తులు అమ్మవారిని సందర్శించి తమ మొక్కులు తీర్చుకుంటున్నారని తెలిపారు.విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి వినాయక అభిషేకాలు, అమ్మవారికి సహస్ర నామార్చన,అయ్యప్ప స్వామికి అభిషేకము,అమ్మవారికి పంచామృత అభిషేకములు,అమ్మవారికి మల్లెల పుష్పార్చన అనంతరం అమ్మవారి గ్రామోత్సవం వంటి విశిష్ట పూజ కార్యక్రమాలు నిర్వహించడము జరిగిందని శుక్రవారంశ్రీనివాసరావు గురుస్వామి తెలిపారు.శనివారం అమ్మవారికి గాజుల అలంకరణ అమ్మవారికి పల్లకీ సేవ,అమ్మవారి కుంకుమార్చన తదుపరి తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు.శనివారం రాత్రి 8 గం ల నుండి అన్నప్రసాద వితరణ జరుగుతుందని భక్తులు పాల్గొని అమ్మవారి కృపా కటాక్షాలకు పాత్రులు కాగలరని అన్నారు.శేకూరు గ్రామ ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమాలను జయప్రదం చేస్తున్నారని తెలిపారు.

# నూతన సియస్‌కి శుభాకాంక్షలు తెలియజేసిన ఏపిజెఏసి అమరావతి నాయకులు



**విజయవాడ,జూన్ 7, (ఆంధ్రపత్రిక) :** శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గా నూతనముగా ఈ రోజు బాధ్యతలు చేపట్టిన గౌరవ శ్రీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఐ.ఏ.ఎస్ గారిని ఆయన చాంబర్ లో మర్యాధపూర్వకంగా ఏపిజేఏసి అమరావతి స్టేట్ చైర్మన్ శ్రీ.బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కలసి శుభాకాంక్షలు తెలియజేయడమైనది. ఈకార్యక్రమంలో ఏపిజెఏసి అమరావతి స్టేట్ సెక్రటరీ జెనరల్ పలిశెట్టి దామోదరరావు, ఏపిరెవిన్యూసర్వీసెస్ అసోషియేషన్ కె.రమేష్ కుమార్,రాష్ట్ర ఉపాధ్యక్షులు రామిశెట్టి వెంకటరాజేష్, ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ దొప్పలపూడి,క్లాస్ -IVఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్రఅధ్యక్షులు యస్. మల్లేశ్వరరావు, ఏపీ జెఏసి అమరావతి మహిళా విభాగం చైర్ పర్సన్ శ్రీమతి పారే లక్ష్మి, వైస్ చైర్ పర్సన్ శ్రీమతి డి.రత్నకుమారి, గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల అర్లయ్య, ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.జి.ప్రసాధ్, యన్టీఆర్ జిల్లా రెవిన్యూసర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేవరపల్లి శ్రీనివాస్, ఆర్టీసి ఇ.యు నాయకులు యం.శంక రరావు, తధితరులు కలసి శుభాకాంక్షలు ఏపిజేఏసి అమవారతి రాష్ట్రకమిటి తరుపున శుభాకాంక్షలు తెలియజేసారు.

# నారా లోకేష్‌ను అభినందించిన నల్లాని రాజేశ్వరి



**అనంతపురము,జూన్ 7 (ఆంధ్రపత్రిక):** టిడిపి కూటమి ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్యే నారా లోకేష్ ను ప్రముఖ విద్యావేత్త, కాలమిస్ట్, సామాజిక కార్యకర్త, ఎన్.ఆర్.ఐ. ఫౌండేషన్ ఛైర్ పర్సన్ నల్లాని రాజేశ్వరి ప్రత్యేకంగా అభినందించారు.

మంగళగిరి శాసనసభ్యునిగా 91 వేలకు పైగా మెజారిటీ రావడం పట్ల రాజేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉండవల్లి లోని క్యాంప్ ఆఫీసులో లోకేష్ ను కలిసిన ఆమె ఘనంగా సత్కరించారు. దుశ్శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరి తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని కూడా ఇవ్వడంతో లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఆర్.ఐ. ఫౌండేషన్ సిఇఓ గుత్తా హరి పాల్గొన్నారు.

# సమతా సైనిక్ దళ్ అధ్వర్యంలో పత్రిక సమావేశం




**విజయవాడ ,జూన్ 7 : (ఆంధ్రపత్రిక):** స్థానిక గాంధీ నగర్ ప్రెస్ క్లబ్ నందు సమతా సైనిక్ దళ్ అధ్వర్యంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేసి , SSD రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్వరావు కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు.SSD రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి.సురేంద్ర బాబు మాజీసైనికుడు మాట్లా డుతూ దేశం మెత్తం ఆంధ్రప దేశ్ ని చూసేలా, ప్రపంచంలో ఉన్న తెలుగు ప్రజలు అందరూ గౌరవం చెప్పుకునే విధంగా గొప్ప విజయాన్ని సాధించిన విజన్ రి లీడర్ గౌరవ నారా చంద్రబాబు కి, జననేత, జనసేన అధినేత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కి SSD టీమ్ తరుపున హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.గత 5 సంవత్సరాల లో జగన్ ప్రభుత్వం లో SC ల పైన దాడులు, తప్పుడు కేసులు పెట్టిన వారిపైన సమగ్ర విచారణ జరిపి , చట్టబద్దంగా చర్యలు తీసుకోవాలి. కొత్త ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వైఎస్ఆర్ పార్టీ నాయకులు అక్రమ మైనింగ్ పైన, ఆర్థిక దోపిడీ పైన అవినీతి పైన CBI విచారణ జరిపించాలి అని డిమాండ్ చేశారు. నారా చంద్రబాబు కి ,పవన్ కళ్యాణ్ కి SSD పూర్తి సహకారం అందిస్తాము అని తెలిపేరు .రాష్ట్రం , దేశ బౌషత్ ఇప్పుడు బాబు చేతులోనే ఉండటం వలన SC,ST,BC మైనారిటీ లకు బాబు పూర్తి మద్దతుగా ఉంటారు అని మేము పూర్తిగా నమ్ముతున్నాము. అధికారం లోకి వచ్చిన తరువాత SC 27 పథకాలను తిరిగి కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశం లో రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్వరావురాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి.సురేంద్ర బాబురాష్ట్ర కార్యదర్శి యర్రం సుధీర్ కుమార్ మరియు సనతా సైనికులు పాలుగున్నారు.

# వాతావరణశాఖ చల్లని శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

కురుస్తున్నాయి. హైదరాబాద్‌లో మరో ఐదురోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో సాయంత్రం సమయంలో కొద్దిరోజులుగా నల్లటి మేఘాలు కమ్ముకొని తేలికపాటి జల్లులు కురుస్తున్నాయి. జీహెచ్ఎంసీ అలర్ట్, 3 రోజులు వానలే నగరంలో పరిశీలన హైదరాబాద్ నగరంలో మాత్రం ఏదో ఒక ప్రాంతంలో భారీ వర్షం పడు తోంది. దీంతో అప్రమత్తమైన గ్రేటర్ హైదరాబాద్ అధికారులు ఎక్కడికక్కడ నాలాలు ఏమైనా ప్రమాదకరంగా ఉన్నాయేమోనని నగరమంతటా తిరిగి పరిశీలి స్తున్నారు. వాతావరణశాఖ కూడా హైదరాబాద్ కు భారీ వర్షాలు చెబుతుండటంతో నగరంలో ట్రాఫిక్ జామ్ విపరీతంగా అవుతోంది. మ్యాన్ హోల్స్ లో చెత్త, చెదారం ఏమీ లేకుండా చర్యలు చేపడుతున్నారు. రోడ్లపై వెళ్లే సమయంలో ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వర్షాలు పడు తున్న సమయంలో విద్యుత్తు స్తంభాలకు దూరంగా ఉండాలని రోడ్లపై చెట్లు పడిపోతే వెంటనే జీహెచ్ ఎంసీ అధికారులకు ఫోన్ చేయాలని, వెంటనే డిజాస్టర్ రెస్పాన్స్ టీం అప్రమత్తమవుతుందని చెబుతున్నారు. సాయంత్రం సమయంలో ఒకేసారి అందరూ ఇళ్లకు వెళ్లేందుకు బయటకు వస్తున్నారని, వర్షం వల్ల తీవ్రంగా ట్రాఫిక్ జాం అవుతోందని, ట్రాఫిక్ పోలీసులు అలర్ట్ గా ఉండాలని, సిగ్నల్స్ దగ్గర ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణ లేకుండా చూడాలని అధికారులు పోలీసులను కోరుతున్నారు. వాహన ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

# ఎపి నూతన సీఎస్‌గా నీరభ్..

(మొదటిపేజీ తరువాయి)

నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. 1987 బ్యాచ్‌కు చెందిన ఆయన.. ప్రస్తుతం రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు సీఎస్‌గా ఉన్న కె.ఎస్.జవహర్‌రెడ్డి గురువారం సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో నూతన సీఎస్ నియామకం జరిగింది. కొత్త సీఎస్ నియమాకం జరిగినందున జవహర్‌రెడ్డిని బదిలీ చేశారు. ఆ వెంటనే ఆయన బాధ్యతలు కూడా స్వీకరించారు. బుధవారం ఉదయం తెదేపా అధినేత చంద్రబాబును నీరభ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి వెళ్లారు. ఈ క్రమంలోనే సీఎంవోలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. పూనం మాలకొండయ్య, రేవు ముత్యాలరాజు, నారాయణ భరత్ గుప్తా ఈ ముగ్గురు ఐఏఎస్ అధికారులు జీఏడీకి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మరో వైపు నూతన సీఎస్‌గా నియమితులైన నీరభ్ కుమార్ ప్రసాద్ సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో బాధ్యతలు చేపట్టారు.

# 12 న సిఎంగా చంద్రబాబు ప్రమాణం..

(మొదటిపేజీ తరువాయి)

వార్తలు వచ్చినప్పటికీ ఆరోజున మోడీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనుండడంతో తేదీని మార్చాల్సి వచ్చింది.మంగళగిరి ఎయిమ్స్ సమీపంలో సభ నిర్వహిస్తే అందరికీ అనువుగా ఉంటుందని అధిష్ఠానం భావిస్తోంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ముఖ్య నేతలతో కలిసి ఇవాళ స్థల పరిశీలన చేయనున్నారు. కార్యక్రమానికి మోడీ కూడా హాజరుకానున్న నేపథ్యంలో హైవే పక్కనే స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు టీడీపీ నేతలు చెప్తున్నారు. మరికాసేపట్లో టీడీపీ బృందంతో కలిసి ఆ ప్రాంతాన్ని అచ్చెన్నాయుడు పరిశీలించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచీ పెద్దఎత్తున అభిమానులు, పార్టీ శ్రేణులు, ప్రముఖులు పాల్గొంటున్న నేపథ్యంలో భారీ స్థాయిలో ఏర్పాట్లను చేయనున్నారు.

# పవన్‌పై మోదీ ప్రశంసలు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో పవన్ మాట్లాడుతూ.. మోదీ ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మోదీ స్ఫూర్తితో ఏపీలో అద్భుత విజయం సాధించామన్నారు. మోదీ వెనుక తామంతా ఉన్నామని ప్రకటించారు. ఎన్డీఏ పక్ష నేతగా మోదీకి తమ పూర్తి మద్దతును పవన్ తెలిపారు.ప్రధాని మోదీ నాయకత్వానికి జనసేన పార్టీ మద్దతిస్తుందని పవన్‌కల్యాణ్ అన్నారు. విజనరీ నాయకుల బాటలో పయనించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. 'జనసేన తరఫున మోదీకి హృదయపూర్వక శుభాకాంక్షలు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఆయన స్ఫూర్తిగా నిలిచారు. మోదీ ప్రధానిగా ఉన్నంత వరకు ఏ దేశానికీ భారత్ తలొగ్గదు. మీ నేతృత్వంలో పనిచేయడాన్ని గర్వంగా భావిస్తున్నాం' అని పవన్ కల్యాణ్ అన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసలు కురిపించారు. ఇక్కడ కూర్చున్న వ్యక్తి పవన్ కాదు తుపాను అని ప్రత్యేకంగా అభినందించారు. దక్షిణాది రాష్ట్రాల గురించి ప్రస్తావించిన సందర్భంగా ఏపీ నేతలను కొనియాడారు. పాత పార్లమెంట్ భవనంలో ఎన్డీయే ఎంపీల సమావేశం జరిగింది. కూటమి లోక్‌సభా పక్షనేతగా మోదీ పేరును భాజపా నేతలు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ ప్రతిపాదించారు. భాగస్వామ్య పార్టీలు దీనికి మద్దతు పలుకుతూ మోదీని ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు ప్రకటించాయి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఏపీలో దక్కిన విజయం ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టిందన్నారు. చంద్రబాబుతో కలిసి చరిత్రాత్మక విజయం సాధించామన్న ఆయన..ఆ సమావేశంలోనే ఉన్న పవన్‌ను అభినందించారు.

# కాంగ్రెస్ గూటికి విశాల్ పాటిల్

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే. విశాల్ పాటిల్ మద్దతుతో లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపిల సంఖ్య 100కి చేరింది. వికాస్ పాటిల్ మద్దతును స్వాగతిస్తున్నట్లు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. విశాల్ పాటిల్, విశ్వజిత్ కదమ్‌లు గురువారం కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను కలిశారని, పార్టీకి తాను మద్దతు ప్రకటిస్తున్నట్లు విశాల్ పాటిల్ తెలిపారని ఖర్గే వెల్లడించారు. మహారాష్ట్ర వికాస్ అఘాడీ (ఎంవిఎ) కూటమిలో సీట్ల ఒప్పందంలో భాగంగా మహారాష్ట్రలోని సాంగ్లీ నియోజకవర్గం శివసేన యుబిటికి కేటాయించారు. దీంతో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వసంత్‌దాదా మనవడైన విశాల్ పాటిల్ కాంగ్రెస్‌పై తిరుగుబాటు ప్రకటించారు. సాంగ్లీ నియోజకవర్గం నుండి స్వతంత్య అభ్యర్థిగా బరిలోకి దిగారు. బిజెపి అభ్యర్థి సంజరు కాకా పాటిల్‌పై విజయం సాధించారు. సీట్ల ఒప్పందానికి ముందే శివసేన వర్గానికి చెందిన ఉద్ధవ్ థాకరే సాంగ్లీ నియోజకవర్గ అభ్యర్థిని ప్రకటించడం వివాదానికి దారితీసింది. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాల్సిందిగా కాంగ్రెస్ పలుమార్లు ఉద్ధవ్ థాకరేను కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో విశాల్ పాటిల్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. మరో నేత పప్పుయాదవ్ కూడా కాంగ్రెస్‌కు మద్దతు తెలపనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు పప్పు యాదవ్ తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. అయితే సీటల ఒప్పందంలో భాగంగా పూర్ణియా సీటు ఆర్‌జెడికి కేటాయించారు. దీంతో పప్పు యాదవ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

# కవిత కస్టడి పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

కవితకు కస్టడీని పొడిగించింది. తదుపరి విచారణను జూన్ 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. అదే రోజు సీబీఐ చార్జిషీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై రౌజ్ అవెన్యూ కోర్టు విచారణ జరపనున్నది. సీబీఐ కేసులో కవితపై దాఖలైన చార్జిషీట్‌ను కోర్టు విచారణకు తీసుకున్నది. తాను చదువుకోవడానికి కొత్తగా 9 పుస్తకాలు కావాలని కోర్టును కవిత కోరింది. కవిత అభ్యర్థనను రౌస్ అవెన్యూ కోర్టు అంగీకరించింది.

# చీఫ్ సెక్రటరీగా మెగా మనిషి విజయానంద్‌కు పదవి నిరాకరణ

**మెగా కృష్ణారెడ్డి, విశ్వ సముద్ర శశికి ఎదురుదెబ్బ..**

**అమరావతి,జూన్ 7 (ఆంధ్రపత్రిక):** జగన్ పాలనలో వేల కోట్లు సంపాదించిన మెగా కృష్ణారెడ్డి, విశ్వసముద్ర శశిచింతాలకు ఎదురుదెబ్బ తగిలింది. కొత్త ప్రభుత్వంలో తమ మనిషి విజయానంద్‌ను పెట్టే ప్రయత్నంలో వీరు విఫలమయ్యారు. విద్యుత్ శాఖలో విజయానంద్ 13వేల కోట్ల కాంట్రాక్ట్‌ను మెగా కృష్ణారెడ్డికి అప్పగించారు. ఈ డబ్బును మెగా – విజయానంద్ – జగన్ పంచుకున్నారు. ఇప్పుడు అదే విజయానంద్‌ను చీఫ్ సెక్రటరీ పదవిలో కూర్చొబెట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దోచుకోవాలని మెగా కృష్ణారెడ్డితో పాటు విశ్వసముద్ర శశి విశ్వప్రయత్నాలు చేశారు. కానీ, ఆఖరి నిమిషంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా దోపిడీ ప్లాన్ అర్థం చేసుకుని విజయానంద్‌కి పోస్ట్ నిరాకరించారు. నీరబ్ కుమార్‌ను సీఎస్‌గా నియమించారు. జగన్ అవినీతిలో భాగస్వామిగా పోలవరాన్ని ముంచి, వేలకోట్లు సంపాదించి, మెడికల్ కాలేజ్ కబ్జాకు ప్రయత్నించిన మెగా కృష్ణారెడ్డి ప్రస్తుత ప్రభుత్వంలో కూడా చక్రం తిప్పాలని ప్రయత్నించడం, దానికి సీబీఎన్ అడ్డుకట్ట వేయటం జరిగింది.

# అద్వానీని కలసి ఆశీర్వాదం తీసుకున్న మోడీ

**న్యూఢిల్లీ,జూన్ 7 :** ఎన్డీయే లోక్‌సభాపక్ష నేతగా ఎన్నికైన నరేంద్ర మోదీ భాజపా కురువృద్ధుడు ఎల్.కె.అద్వాణీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం ముగిసిన తర్వాత నేరుగా ఆయన ఇంటికివెళ్లిన మోదీ... వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయబోతున్న విషయాన్ని ఆయనకు స్వయంగా చెప్పారు. ఇద్దరు నేతలూ వివిధ అంశాలపై కొద్దిసేపు చర్చించుకున్నారు. అక్కడి నుంచి పార్టీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి ఇంటికి వెళ్లిన మోదీ.. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్డీయే కూటమి నేతలతో కలిసి మోదీ మరికాసేపట్లో రాష్ట్రపతి భవన్‌కు చేరుకోనున్నారు. తమ వద్ద ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యా బలం ఉందని చెబుతూ.. అవకాశం ఇవ్వాలని రాష్ట్రపతి విజ్ఞప్తి చేయనున్నారు.

# బిజెపి అంటేనే సుపరిపాలన

(మొదటిపేజీ తరువాయి)



రాష్ట్రపతి భవన్‌లో మోడీ ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుంది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ మోడీని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. నరేంద్ర మోడీ అంతర్జాతీయంగా దేశానికి ప్రతిష్ట తీసుకొచ్చారని అన్నారు చంద్రబాబు. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థకు మోడీ నాయకత్వం వహిస్తున్నారని అన్నారు. మోడీ నేతృత్వంలో భారత్ అగ్రదేశంగా ఎదుగుతుందని అన్నారు. ఏం సాధించాలన్న విజన్ కావాలని, మోడీ విజన్ ఉన్న నాయకుడని అన్నారు. భారత్ అగ్రదేశంగా ఎదగటానికి ఇది గొప్ప అవకాశం ఉందని అన్నారు. మొదటి నుండి ఎన్డీయేతో టీడీపీకి మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. తనకు ఏ ఇజాలు తెలియవని, మానవత్వమే తన ఇజం అని ఎన్టీఆర్ అన్నారని గుర్తు చేశారు. తన జీవితంలోనే ఇదొక గొప్ప సందర్భమని అన్నారు. ఎన్నికల సమయంలో కీలక ప్రచార సభల కోసం మోడీ వచ్చారని అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంపై తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రశంసల జల్లు కురిపించారు. భారత్‌కు సరైన సమయంలో సరైన నాయకుడు దొరికారని, ఆయన నరేంద్ర మోదీ అని చంద్రబాబు పొగిడారు. నరేంద్ర మోదీకి విజన్, ఉత్సాహం ఉన్నాయని, పరిపూర్ణ కార్యదక్షత కలిగిన నాయకుడని అన్నారు. తన విధానాలన్నింటినీ నిజమైన స్ఫూర్తితో అమలు చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం భారత్‌కు చాలా మంచి అవకాశమని, ఇప్పుడు మిస్ అయితే ఎప్పటికీ నష్టపోతామని చంద్రబాబు వ్యాఖ్యానించారు.'ఎన్డీయేను అధికారంలోకి తీసుకురావడానికి మోదీ రేయింబవళ్లు కష్టపడ్డారు. ఎన్డీఏ అద్భుత మెజారిటీ సాధించింది. ఎంతోమంది నేతలను చూశాను కానీ మోదీ లాంటి పవర్‌ఫుల్ నేతలను ఎక్కడా చూడలేదు. ఏపీలో మోదీ కీలక ప్రచార సభలకు హాజరయ్యారు. మేకిన్ ఇండియా విజన్‌తో దేశాన్ని ముందుండి నడిపించారు. మోదీ విజన్ వల్లే దేశం అభివృద్ధిలో దూసుకుపోతోంది. అంతర్జాతీయ స్థాయిలోనూ భారత్ పేరు ప్రఖ్యాతులను మోదీ ఇనుమడింపజేశారు' అని చంద్రబాబు ప్రశంసించారు. మోదీ విజన్, సమర్థత దేశానికి ఎంతో అవసరని ఈ సందర్భంగా చంద్రబాబు వ్యాఖ్యానించారు. దేశానికి మోదీ ఎన్నో అద్భుత విజయాలు అందించారని, దేశంలో యువశక్తి ఐటీ రంగంలో దూసుకుపోతోందని ప్రస్తావించారు. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థకు మోదీ నాయకత్వం వహిస్తున్నారని, ఏం సాధించాలన్నా ఒక విజన్ ఉండాలని, మోదీ విజన్ ఉన్న నాయకుడని చంద్రబాబు మెచ్చుకున్నారు. ఇక లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన నూతన ఎంపీలు అందరినీ ఆయన అభినందించారు. ఎన్డీయే అంటేనే సుపరిపాలన. మన కూటమి అసలైన భారత్ స్ఫూర్తిని చాటుతుంది. మనది అత్యంత విజయవంతమైన భాగస్వామ్యం' అని నరేంద్రమోదీ అన్నారు. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం దిల్లీలో శుక్రవారం జరిగింది. ఇందులో తమ లోక్‌సభా పక్ష నేతగా మోదీని ఎన్డీయే నేతలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిత్రపక్షాలకు కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే ప్రదర్శనపై హర్షం వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లలో ఈ కూటమి దేశాన్ని మూడుసార్లు ఐదేళ్లు పాలించింది. మరోసారి ఐదేళ్ల పాలనకు ప్రజలకు అవకాశమిచ్చారు. దేశం కోసం నిబద్ధత కలిగిన బృందం ఇది. ఎన్డీయే అంటేనే సుపరిపాలన. పేదల సంక్షేమమే మనందరి ప్రథమ కర్తవ్యం. దేశ అభివృద్ధి చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించాం. వికసిత్ భారత్ స్వప్నాన్ని సాకారం చేసి తీరుతాం. మన కూటమి అసలైన భారత్ స్ఫూర్తిని చాటుతుంది. ఎన్నికల ముందు పొత్తు పెట్టుకున్న కూటమి ఇంతగా ఎప్పుడూ విజయవంతం కాలేదు. ప్రభుత్వం ఏర్పాటు కావాలంటే సంఖ్యాబలం అవసరం. దేశాన్ని నడపాలంటే సర్వసమ్మతం కావాలి. కూటమిలో పరస్పర విశ్వాసమే ప్రధానం. అన్ని అంశాల్లో ఏకగ్రీవ నిర్ణయాలే లక్ష్యం' అని మోదీ అన్నారు. ఇక ఔఆం అంటే 'న్యూ ఇండియా, డెవలప్‌డ్ ఇండియా, ఆస్పిరేషనల్ ఇండియా' అని కొత్త అర్థం చెప్పారు. దక్షిణాది ప్రజలు ఎన్డీయేను ఆదరించారు. కర్ణాటక, తెలంగాణలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అతి తక్కువ కాలంలోనే అక్కడి ప్రభుత్వాలు ప్రజల విశ్వాసం కోల్పోయాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఆ రాష్ట్రాల్లోని ప్రజలు భాజపాకు అండగా నిలిచారు. తమిళనాడులో సీట్లు గెలవలేకపోయినా ఓట్లు పెరిగాయి. కేరళలోనూ మా కార్యకర్తలు ఎన్నో బలిదానాలు చేశారు. తొలిసారి అక్కడి నుంచి మా ప్రతినిధి సభలో అడుగుపెడుతున్నారు. అరుణాచల్, సిక్కింలో క్లీన్‌స్వీప్ చేశాం. ఏపీ ప్రజలు కూటమికి పెద్ద ఎత్తున మద్దతిచ్చారు. చంద్రబాబుతో కలిసి చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నాం. ఏపీలో ఇంత భారీ విజయం ప్రజల ఆకాంక్షలను అద్దం పట్టిందని మోదీ కొనియాడారు. ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించింది. అయినా కూడా విపక్షాలు మన విజయాన్ని తిరస్కరించేందుకు ప్రయత్నించాయి. మనం ఓడిపోయామని చిత్రీకరించాలని చూశాయి. కానీ, మనకు ఓటమి లేదని దేశ ప్రజలకు తెలుసు. ఎన్నికల ముందు ఈవీఎంలను కొందరు సందేహించారు. ఫలితాల తర్వాత అవన్నీ పటాపంచలయ్యాయి. ఇకనైనా విపక్షాలు పార్లమెంట్‌లోకి వచ్చి చర్చల్లో పాల్గొంటాయని భావిస్తున్నానని మోదీ చురకలంటించారు.

# రాష్ట్రపతి ముర్ముతో మోదీ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ద్రౌపది ముర్మును మోడీ కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా తనను లోక్ సభ పక్షనేతగా ఎన్డీయే మిత్రపక్షాలు ఎన్నుకున్న తీర్మానాన్ని రాష్ట్రపతికి అందజేశారు. మోదీ వెంట ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు ఉన్నారు. తమ కూటమికి మద్దతు ఇస్తోన్న పార్టీల లేఖలు, కొత్తగా ఎంపికైన మొత్తం ఎంపీల జాబితాను రాష్ట్రపతికి మోదీ అందించారు. ఈ క్రమంలో కేంద్రంలో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని మోదీని రాష్ట్రపతి ఆహ్వానించారు. మోదీకి రాష్ట్రపతి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఓ జ్ఞాపికను బహూకరించారు. దేశానికి మరింత సేవ చేయాలని ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారని.. దేశ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్తామని మోదీ అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతిచ్చే ఎంపీల జాబితాను రాష్ట్రపతికి అందించామని.. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరినట్లు చెప్పారు. ఈ నెల 9న ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు రాష్ట్రపతికి తెలియజేశామని వెల్లడించారు.ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఎన్డీయే కూటమి నేతలు శుక్రవారం ఉదయం కీలక సమావేశం నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్,ఏక్‌నాథ్ షిండే, చిరాగ్ పాశ్వాన్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ ఎన్డీయే పక్షనేతగా మోదీని ప్రతిపాదించగా ఎంపీలంతా ఆమోదించారు. ఈ క్రమంలో ఆయన మూడోసారి ప్రధానిగా ఈ నెల 9న కర్తవ్యపథ్‌లో ప్రమాణం చేయనున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు మోదీ బాధ్యతలు చేపట్టేలా ముహూర్తం ఖరారు చేశారు. ఆ రోజు ప్రధానితో పాటు కొందరు మంత్రులు కూడా ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతిచ్చే ఎంపీల జాబితాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు అందజేశామని ప్రధాని మోదీ తెలిపారు.

# నీట్ ఫలితాల్లో అవకతవకలు

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. దీనిపై వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని వెంటనే దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. తొలుత నీట్ ప్రశ్నాపత్రం లీకైందన్న ఆమె... ఇప్పుడు ఫలితాల్లోనూ కుంభకోణం జరిగినట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. ఈమేరకు తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు ఆమె చెప్పారు. వీటన్నింటినీ నివృత్తి చేయాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మరోవైపు నీట్ ఫలితాల వెల్లడి తర్వాత పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుండటంపై ప్రియాంక దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. నీట్ పేపర్ లీకేజీ ఆరోపణలపై అధికారులు సరైన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ' లక్షలాది మంది విద్యార్థుల గోడును ఈ ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తోంది. నీట్ పరీక్ష ఫలితాల్లో అవకతవకలు జరిగాయని పదేపదే మొత్తుకుంటున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు. దర్యాప్తు చేపట్టి వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా?' అని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. నీట్ పరీక్ష ఫలితాలపై పలువురు అభ్యర్థులు, తల్లిదండ్రులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. జూన్ 4న వెలువడిన నీట్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. అందులో ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురికి 720కి 720 మార్కులు రావడం గమనార్హం. మరోవైపు నీట్ పరీక్ష పేపర్ లీకైనట్లు వార్తలు గుప్పుమన్నాయి. అయితే, దీనిని తప్పుడు ప్రచారంగా ఎన్‌టీఏ కొట్టి పారేసింది. మే 5న సాయంత్రం 4 గంటల సమయంలో ప్రశ్నపత్రం ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ సమయానికే దేశవ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో పరీక్ష మొదలైపోయిందని, అందువల్ల ప్రశ్నపత్రం లీక్ కాలేదని క్లారిటీ ఇచ్చింది.

# రాహుల్‌కు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి బెంగళూరులోని ప్రత్యేక కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రచురించిన ప్రకటనల్లో రాష్ట్రంలోని అప్పటి బిజెపి ప్రభుత్వం తన 2019- 2023 పాలనలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. పరువునష్టం కేసు సందర్భంగా కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఈ నెల 1న కోర్టుకు హాజరైనప్పుడు వారికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 7న కోర్టుకు తప్పనిసరిగా హాజరు కావాలని రాహుల్ గాంధీని న్యాయమూర్తి కెఎన్ శివకుమార్ ఆ రోజు ఆదేశించారు. గత రెండు విచారణలకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరినందుకు రాహుల్ గాంధీ శుక్రవారం క్షమాపణ తెలియజేశారు. కోర్టు ఆయన క్షమాపణను అంగీకరించి రూ. 75 లక్షల ష్యూరిటీతో బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ గాంధీతో పాటు సిద్ధరామయ్య, శివకుమార్ కూడా కోర్టుకు హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కర్నాటకలోని అన్ని ప్రధాన స్రవంతి దినపత్రికల్లో నిరుడు మే 5న నిందితులు 'అవినీతి రేటు కార్డు', '40 శాతం కమిషన్ సర్కార్' శీర్షిక కింద జారీ చేసిన ప్రకటనల్లో తప్పుడు, నిర్లక్షపూరిత ఆరోపణలు చేశారని నిరుడు జూన్‌లో దాఖలు చేసిన ఫిర్యాదులో బిజెపి ఆరోపించింది. కెపిసిసి అధ్యక్ష హోదాలో శివకుమార్, శాసనసభలో అప్పటి ప్రతిపక్ష నాయకుని హోదాలో సిద్ధరామయ్య ద్వారా కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) ఆ ప్రకటనలు జారీ చేసిందని బిజెపి తన ఫిర్యాదులో ఆరోపించింది. రాహుల్ గాంధీ ఆ 'పరువునష్టం కలిగించే ప్రకటన'ను తన సామాజిక మాధ్యమం 'ఎక్స్' పోస్ట్‌లో పొందుపరిచారని బిజెపి పేర్కొన్నది. రాహుల్ గాంధీ స్వయంగా కోర్టు ముందు హాజరైన తరువాత బిజెపి 'ఎక్స్' పోస్ట్‌లో వ్యాఖ్యానిస్తూ, 'నేషనల్ హెరాల్డ్ కేసులో బెయిల్‌పై విడుదలైన నిందితుడు రాహుల్ గాంధీ ! నమ్మ బెంగళూరుకు మీకు స్వాగతం. కర్నాటకలోని మా నేతలపై మీరు ఉపయోగించిన, ఇప్పటి వరకు మీరు రుజువు చేయలేకపోయిన తప్పుదారి పట్టించే, పరువునష్టం పూర్వక ప్రకటనలకు సంబంధించి భారతీయ చట్టాల పరిణామాలను అను భవించేందుకు మీకు స్వాగతం పలుకుతున్నాం' అని పేర్కొన్నది.

# వాస్తవాలు మాట్లాడాలి

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారని ఆరోపణలు వస్తున్న అంశంపై ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని పాఠశాల విద్యా శాఖ పరిధిలో గతంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయం, దరిమిలా దానిపై ఆరోపణలతో పత్రికలు వార్తాంశాలు ప్రచురించాయన్నారు. తనపై వ్యక్తిగతమైన ఆరోపణలు చేస్తూ ప్రచురితమైన వార్తాంశాలు పూర్తిగా అవాస్తవం, అభూత కల్పనలతో నా వ్యక్తిత్వ హననానికి చేస్తున్న ప్రయత్నం తప్ప మరొకటి కాదని చెప్పుకొచ్చారు.ఎన్నికలకు ముందు నుంచీ కూడా ఇవే ఆరోపణలతో అనేక సార్లు వార్తలు ప్రచురించాయని గుర్తు చేశారు. అప్పుడే ఖండించిన విషయాలను మీకు గుర్తు చేస్తున్నాను.ఇప్పుడు మరోసారి ఖండిస్తున్నాను, గర్హిస్తున్నానన్నారు. కొంత మంది ఉపాధ్యాయులు తమ ఆరోగ్య, కుటుంబ ఇతరత్రా ఇబ్బందులు, వివిధ వ్యక్తిగత సమస్యల రీత్యా బదిలీలు కోరుకుంటూ అర్జీ పెట్టుకోవడం జరిగింది. వాటిని పూర్తి పారదర్శకంగా పరిశీలించి క్షేత్ర స్థాయి నుంచి నివేదికలు తెప్పించుకున్న తరువాతనే అప్పట్లో నిర్ణయం తీసుకోవడమైందన్నారు. ఫలితాలు వెలువడిన వెంటనే ఈ బదిలీలు నిలిపేయాల్సిందిగా సంబంధిత అధికారులను తానే స్వయంగా కోరడం జరిగిందన్నారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం వస్తున్నందున ఈ విషయంలో వారు తమకు నచ్చిన నిర్ణయం తీసుకోవచ్చు. బదిలీల కోసం అర్జీచేసుకున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిగణలోకి తీసుకుంటారా? లేదా? అన్నది కొత్త ప్రభుత్వం ఇష్టం. వాస్తవాలు ఇలా ఉంటే బదిలీలకోసం లంచాలు తీసుకున్నారంటూ తప్పుడు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. అలాంటి తప్పుడు పనులు చేయాల్సిన అగత్యం, అవసరం మాకు లేవని చెప్పుకొచ్చారు. దాదాపుగా పదిహేను వందల మంది ఉపాధ్యాయులకు ఎన్నికలకు ముందు బదిలీలు చేపట్టారు. వారి వద్ద నుంచి పెద్ద ఎత్తున నగదు తీసుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వైసీపీ ఓడిపోవడంతో మంత్రిగా బొత్స పదవి కూడా పోయింది. అయితే బదిలీలు మాత్రం జరగలేదు. దీంతో డబ్బులు ఇచ్చిన ఉపాధ్యాయులు ఆందోళనకు సిద్ధమవతు?న్నారు. డబ్బులు ఇచ్చినా బదిలీలు జరగలేదని ధర్నాకు సిద్ధమయ్యారన్న ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో అందరూ బొత్స సత్యనారాయణ వైపే చూస్తున్నారు. దీంతో ఆయన.. బదిలీలు జరగలేదని.. తప్పేమీ లేదని అంటున్నారు.

# కొందరు ఓట్లేస్తున్నారు.. కొందరు తిడుతున్నారు..

**ముంబయి,జూన్ 7 :** బాలీవుడ్ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ ను గురువారం చండీగఢ్ విమానాశ్రయంలో మహిళా సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చెంపదెబ్బ కొట్టడంపై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ శుక్రవారం స్పందించారు. కొందరు ఓట్లు వేస్తే మరికొందరు తిడుతున్నారు, ఇంకొందరు కొడుతున్నారు. అసలేం జరిగిందో తెలియదు. రైతులు చేసిన ఆందోళనలో మా అమ్మ కూడా ఉందని కానిస్టేబుల్ చెప్పింది నిజమే అయ్యుండొచ్చు. కన్న తల్లిని ఏమైనా అంటే ఎవరికైనా కోపం వస్తుంది కదా. ప్రధానమంత్రి మోదీ చట్టబద్ధమైన పాలన ఉండాలని చెబుతుంటారు. అలా ఉన్నప్పుడు దానిని చేతుల్లోకి తీసుకోవద్దు ... దేశవ్యాప్తంగా ఆందోళనలు చేసిన రైతులంతా భారత మాత పిల్లలే. ఎవరైనా వారిని అవమానిస్తున్నారంటే అది ఆలోచించాల్సిన విషయమే. కంగనాపై దాడికి సానుభూతి తెలుపుతున్నాను. ఆమె ఇప్పుడు గౌరవనీయమైన ఎంపీ పదవిలో ఉన్నారు. ఎంపీపై దాడి చేయడం ఎలాగైతే సరైనది కాదో, అలాగే రైతులకు మర్యాద ఇవ్వకపోవడం సరైనది కాదు' అని సంజయ్ రౌత్ మీడియాతో అన్నారు.గురువారం విమానాశ్రయంలో భద్రతా తనిఖీ చేసుకొని ముందుకువెళుతున్న కంగనను అక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్ చెంపదెబ్బ కొట్టారు. గతంలో కేంద్రం చేసిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన నిరసనలను ఉద్దేశించి కంగన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో విమర్శలకు దారితీశాయి. వారు రూ.100 కోసం అక్కడ కూర్చున్నారని, నిజమైన నిరసనకారులు కారని ఆమె వ్యాఖ్యలు చేశారు. ఆ మాటలు తననెంతో బాధించాయని కానిస్టేబుల్ చెప్పారు. ఆ ఆందోళనలో తన తల్లి కూడా పాల్గొందని, వారు న్యాయం కోసం పోరాడుతుంటే కంగన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తనకు కోపం తెప్పించిందని ఆమె పేర్కొన్నారు. అనంతరం కంగనపై దాడి చేసినందుకు అధికారులు ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

# పార్లమెంట్ హాలులో ఆసక్తికర సన్నివేశం

**న్యూఢిల్లీ,జూన్ 7 :** లోక్‌సభ ఎన్నికలు-2024లో ఎన్డీఏ (ఔఆం) మ్యాజిక్ ఫిగర్‌ను మించి 293 స్థానాలను కైవసం చేసుకో వడంతో.. మూడోసారి ప్రభుత్వ ఏర్పాటు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే.. ఆ కూటమి ఎంపీలు శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా.. ఓ ఆసక్తికరమైన సన్నివేశం చోటు చేసుకుంది. ఎన్డీఏ కూటమి నాయకుడిగా నరేంద్ర మోదీకి మద్దతు తెలియజేసేందుకు నితీశ్ కుమార్ లేచి వెళ్లి మాట్లాడారు. అనంతరం తన సీట్లోకి వెళ్తున్నప్పుడు.. మోదీతో చేతులు కలిపి, ఆయన పాదాలను తాకేందుకు ప్రయత్నించారు. అయితే.. తన పాదాల్ని తాకొద్దని మోదీ సున్నితంగా తిరస్కరిస్తూ నితీశ్‌తో కరచాలనం చేశారు. ఆ సమయంలో ఇద్దరూ చిరునవ్వు చిందిస్తూ కనిపించారు. అంతకుముందు నితీశ్ కుమార్ మాట్లాడుతూ.. ఏ సందర్భంలోనైనా తాను ప్రధాని మోదీతోనే ఉంటానని నొక్కి చెప్పారు. ఇండియా కూటమి నేతలు ఈసారి పొరపాటున గెలిచారని.. దేశం కోసం వాళ్లు ఏమీ చేయలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వాళ్లందరూ కచ్చితంగా ఓడిపోతారని జోస్యం చెప్పారు. దేశం ఇకపై బృహత్తర ప్రణాళికలు వేసుకుని ముందుకు సాగుతుందని.. మోదీ నేతృత్వంలో తామంతా కలిసి పని చేస్తామని చెప్పారు. ఈ పదేళ్ల కాలంలో దేశం కోసం మోదీ ఎంతో చేశారన్నారు. ఎన్డీఏ పక్షాలన్ని ఏకతాటిపైకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆది వారం మోదీ ప్రధానిగా ప్రమాణం చేయబో తున్నారని, కానీ ఇవాళే ఆయన ప్రమాణస్వీకారం చేయాలని తాను కోరుకుంటున్నానని నితీశ్ చెప్పుకొచ్చారు.



ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ మీటింగ్ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమైన ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మరియు ఇతర పార్లమెంట్ సభ్యులు



కనిగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయులు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన కార్యకర్తలు, అభిమానులు, తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు

# ఎయిమ్స్ డైరెక్టర్‌తో ఎస్ఆర్ఎం బృందం భేటీ



## - పరిశోధనా రంగ ప్రాజెక్టులపై పరస్పర చర్చలు

**అమరావతి, జూన్ 7 (ఆంధ్రపత్రిక) :** మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయి మ్స్) డైరెక్టర్ డాక్టర్ మదబానందకర్‌తో ఏపీ ఎస్ ఆర్ఎం యూనివర్సిటీ బృందం శుక్రవారం భేటీ అయ్యింది. ఏడాది కిందట ఎయిమ్స్, ఎస్ఆర్ఎం వర్సిటీల నడుమ బోధన, పరిశోధనలకు సంబం ధించి జరిగిన ఎంవోయూ గురించి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆదోరా ప్రస్తావించారు. ఎంవోయూ ద్వారా తీసుకున్న నిర్ణ యాలను అమలు పరిచేందుకు ఎయిమ్స్ సహకా రం అవసరమనీ, కార్యాచరణ ప్రణాళికను రూ పొందించుకుని ముందుకు వెళ్లాల్సి ఉందని అభి ప్రాయపడ్డారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ బయోలాజికల్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ జయశీలన్ మురుగయ్యాన్ ఎస్ఆర్ఎం వర్సిటీ స్వరూపాన్ని తెలియజేస్తూ, పరిశోధనలకు సంబంధించిన అం శాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివ రించారు. యూనివర్సిటీలో జరుగుతున్న పరిశోధ నల పురోగతిని వైస్ ఛాన్సలర్ మనోజ్ కుమార్ వివరించారు. ఎస్ఆర్ఎం వర్సిటీ చేపట్టే రీసెర్చ్ ప్రాజెక్టులు, అవుట్ రీచ్ ప్రోగ్రామ్స్, వర్క్ షాప్స్, ఇన్వెన్సన్స్ వంటి అంశాల్లో రెండు సంస్థలు పరస్పర సహకారం అందించుకోవాలని కోరారు. దీనికి ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మదబానందకర్ సమ్మతించి అవసరమైన సూచనలు చేశారు. నెలకోసారి అటు ఎస్ఆర్ఎం.ఇటు ఎయిమ్స్ అధికారులు సమావేశమై పరిశోధనలకు సంబంధిం చిన అంశాలపై చర్చించుకోవడం మంచిదన్నారు. ఉమ్మడి పరిశోధనలకు అవసరమై లేబొరేటరీలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ భేటీలో ఎయిమ్స్ డైరెక్టర్తో పాటు డిప్యూటీ డైరెక్టర్ శశికాంత్, డాక్టర్ శ్రీమంతకుమార్ దాస్, డాక్టర్ దీప్తి, డాక్టర్ ఆరతిగుప్తా. ఎస్ఆర్ఎం వర్సిటీ డీన్ డాక్టర్ సినీ టామి, ప్రొఫెసర్లు మహేశ్ కుమార్ రవ్వా, డాక్టర్ కేఏ సునీత పాల్గొన్నారు



సి.ఎస్‌పురంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయులు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన కార్యకర్తలు, అభిమానులు, తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు.







కనిగిరి నియోజకవర్గం సి. యస్. పురంలోని భైరవకోన లో శ్రీ కాలభైరవేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయులు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డి మరియు ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు అభిమానులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# నూతన ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందిద్దాం

### జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు

**అమరావతి, జూన్ 7 (ఆంధ్రపత్రిక) :** నూతన ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించి జిల్లాకు మరింత వన్నె తెచ్చేందుకు కృషి చేయాలనీ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఏపీఎంజీవో అసోసియేషన్ నగర శాఖలో ఖాళీ అయినా పదవులకు కో ఆప్షన్ పద్ధతిలో ఎన్నిక కాబడిన నగర శాఖ అద్యక్షులు సివిఆర్ ప్రసాద్, సహా అద్యక్షులు బి.రాజశేఖర్, ఉపాధ్యక్షులు ఎం. శ్రీనివాసరావు, కార్యదర్శి షేక్ నజీరుద్దీన్, కోశాధికారి డివిఎస్ ఎన్ శ్రీనివాస్ లు సంఘ నాయకులతో కలిసి శుక్రవారం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఎస్. ఢిల్లీరావుని మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గ సభ్యులని అభినందిచి అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల నిర్వహించిన సాధారణ ఎన్నికలు అత్యంత పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించడంలో ఉద్యోగుల సహకారం ఎంతో ఉందన్నారు. ఎన్నికల అనంతరం ఏర్పడనున్న నూతన ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు ఉద్యోగులు బాధ్యతయుతమైన పారదర్శకతతో కూడిన సేవలను అందించేందుకు కృషి



చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేసి జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచడంలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా మాజీ కార్యదర్శి ఎండి.ఇక్బాల్, సహా అధ్యక్షులు పీవి రమేష్, కోశాధికారి బి. సతీష్ కుమార్, నగర శాఖ కార్యదర్శి వివి. ప్రసాద్, ఉపాధ్యక్షులు బి. మధుసూధనరావు, మహిళా కార్యవర్గ సభ్యులు కె. శివలీల, బి. విజయశ్రీ, ఎండి. ఖాసీం సాహెబ్ తదితరులు ఉన్నారు.



శుక్రవారం విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో తమ నాయకుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడోసారి ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఎన్నికైనందుకు బీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

ఆంధ్రపత్రిక ఫోటోలు : సి. హెచ్.విజయ భాస్కర్







వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన నీరబ్ కుమార్ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్..





ఏపీ ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్ ప్రసాద్ ఏపీ సెక్రటేరియట్‌లో బాధ్యతలు స్వీకరించారు



Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com